ప్రజాశక్తి
మంగళవారం 11 ఏప్రిల్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

ఎండుతున్న రబీ పంటలు

సత్తెనపల్లిలో ఆదివారం ఆందోళన చేస్తున్న రైతులు

సాగర్ కుడి కాల్వ పరిధిలో రోడ్డెక్కుతున్న రైతులు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

నాగార్జున సాగర్ కుడి కాలువకు ఈ నెల ఒకటో తేదీ నుంచి సాగు నీటి విడుదలను అధికారులు నిలిపివేశారు. దీంతో, దీని పరిధిలోని ఆయకట్టు భూముల్లో సాగవుతున్న రబీ పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రధానంగా మిర్చి, మొక్కజొన్న, వరి పంటలకు కీలక సమయంలో సాగు నీరు ప్రశ్నార్థకంగా మారింది. సాగర్ ఆయకట్టు పరిధిలోని పల్నాడు జిల్లాలో ఖరీఫ్ సీజన్లో రెండు లక్షల ఎకరాల్లో వరి సాగు కావాల్సి ఉండగా, గత ఖరీఫ్ సీజన్లో లక్షా ఐదు వేల ఎకరాల్లోనే సాగైంది. రబీలో రబీలో లక్ష ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా 48 వేల ఎకరాల్లో మాత్రమే సాగవుతోంది. ప్రస్తుతం వరి కంకి దశలో ఉంది. 1.80 లక్షల ఎకరాల్లో సాగవుతున్న మిర్చి చివరి కోతలకు సిద్ధంగా ఉంది. ఈ తరుణంలో నీటి సరఫరా నిలిపివేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మిర్చి పొలాలు బెట్టకొస్తున్నాయి. పల్నాడు జిల్లాలో రబీలో సీజన్లో 35 వేల ఎకరాల్లో మొక్కజొన్న వేశారు. ప్రస్తుతం ఆ పంట కంకి దశలో ఉంది. గత ఖరీఫ్ సీజన్లో పల్నాడులో దాదాపు లక్షా 50 వేల ఎకరాల్లో ఏ పంటలూ వేయకుండా రైతులు భూములను ఖాళీగా ఉంచారు. రబీలో కొంత మేరకు సాగు చేశారు. ఈ పంటలు త్వరలో చేతికందనున్న తరుణంలో నీటి సరఫరా నిలిపివేయడంపై వివిధ ప్రాంతాల్లో రైతులు రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నారు. సాగర్ జలాశయం గరిష్ట నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 530 అడుగులు మాత్రమే ఉంది. 2022-23 వ్యవసాయ సీజన్లో అవసరానికిమించి నీటిని రైతులు వినియోగించుకున్నారని అధికారులు చెప్తున్నారు. కుడి కాలువ పరిధిలో 132 టిఎంసిల నీరు వినియోగించుకోవాల్సి ఉండగా 200 టిఎంసిలను వినియోగించుకుంటున్నారని అంటున్నారు. అయితే, ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో విడుదల చేసిన నీటిలో ఎక్కువ శాతం సముద్రంలోకి వృథాగా పోయిందని రైతులు చెప్తున్నారు. రబీలో సాగైన వరి, ఇతర

నెలాఖరు వరకూ సాగునీరివ్వాలి

కౌల్దార్ల గుర్తింపు కోసం రెవెన్యూ, వ్యవసాయ శాఖలు, రైతు సంఘాల ప్రతినిధులతో మానిటరింగ్ కమిటీని వేయాలి : కౌలురైతు సంఘం

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు జిల్లాలో నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో వరి రైతులకు రెండుళ్లుగా వరుస నష్టాల నేపథ్యంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో వరి చాలా తక్కువగా సాగైందని, ప్రభుత్వం ఈ సారైనా పూర్తిస్థాయిలో నీరందించి రైతులను ఆదుకోవాలని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక ▶ 2లో

సమావేశంలో మాట్లాడుతున్న వై.రాధాకృష్ణ

పంటలకు పూర్తి స్థాయిలో నీరందించి ఆదుకోవాలని ఎపి కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు

ప్రజావ్యతిరేక విధానాలపై 14 నుండి విస్తృత ప్రచారం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 14న అంబేద్కర్ జయంతి రోజు నుండి 30వ తేదీ వరకు సిపిఎం-సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేయనున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తెలిపారు. సోమవారం బ్రాడీపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు అధ్యక్షతన ఆ పార్టీ జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. బాబూరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెరిగిపోయాయన్నారు. ప్రజలకు ఉపాధి లేక జీవన పరిస్థితులు దిగజారుతున్నాయన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ▶ 2లో

నేడు మండుటెండలో పూలే దీక్ష

హాజరు కానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో దళితులు, గిరిజనులపై జరుగుతున్న దుర్మార్గమైన దాడులను అరికట్టాలని, దాడులపై ఉన్నతస్థాయి న్యాయ విచారణ జరిపించాలని నేడు సిపిఎం ఆధ్వర్యంలో జ్యోతిరావు ఫూలే 196వ జయంతిని పురస్కరించుకొని మండుటెండలో 'పూలే దీక్ష' నిర్వహిస్తున్నట్లు సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన జారీ చేశారు. దీక్షలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. తొలుత ఉదయం 10 గంటలకు మార్కెట్ సెంటర్లోని జ్యోతిరావుపూలే విగ్రహానికి వి.శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని, అనంత రం అక్కడి నుండి లాడ్జి సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వరకూ పాదయాత్ర నిర్వహిస్తారని, తర్వాత 11 గంటలకు ఎండలో నిరసన దీక్ష చేపడతారని వివరించారు. దళిత, గిరిజన ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, విద్యావంతులు, ప్రజలు దీక్షల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కడపలో పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ అచ్చన్న హత్య, కాకినాడ జిల్లా శృంగవృక్షంలో తొండంగి దళిత యువకుడు నడిపల్లి రాము హత్య, నెల్లూరు జిల్లా దగదర్తి మండలంలో దళిత కౌలురైతు తలారి రవికుమార్పై దాడులు అక్రమ కేసులు, వైసిపి నాయకుడు ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య, వాకపల్లి గిరిజన మహిళలకు జరిగిన అన్యాయం వంటి సంఘటనలు రాష్ట్రంలో దళితులు, గిరిజనులపై దాడులు, హత్యలు పెచ్చరిల్లుతున్నాయని అనడానికి తార్కాణాలని, ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం నిందితులకే కొమ్ముగాస్తున్నాయని, దళిత, గిరిజనులకు రక్షణగా ఉన్న చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. ఈ ఘటనలపై ఉన్నతస్థాయి న్యాయ విచారణ జరిపించాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న దీక్షలో దళిత, గిరిజన ప్రజాసంఘాల నాయకులు, ప్రజలూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పందేలను ప్రారంభిస్తున్న మంత్రులు రోజా, రాంబాబు

కోలాహలంగా ఎడ్ల పందేలు

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక లక్ష్మీచెన్నకేశవ స్వామి తిరునాళ్ల సందర్భంగా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మూడ్రోపులుగా నిర్వహిస్తున్న ఎడ్లపందేలు కొనసాగుతున్నాయి. సోమవారం పందేలను మంత్రులు ఆర్కె రోజా, అంబటి రాంబాబు, ఆదిమూలపు సురేష్, బాపట్ల ఎంపీ నందిగం సురేష్ ప్రారంభించి సందడి చేశారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసే దమ్ములేక చంద్రబాబు, అతని దత్తపుత్రుడు కలిసికట్టుగా కుయుక్తులు పన్నుతున్నారని, ఎవరెన్ని చేసినా 175 స్థానాల్లో వైసిపి గెలుస్తుందని అన్నారు. రాంబాబు మాట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్ కూడా ఓడిపోతారని, ఎవరేమీ చేయలేరని అన్నారు. మంత్రి సురేష్ వరికపూడిసెలకు కేంద్రం ఈ నెలలో అనుమతిస్తుందని చెబుతున్నారని, ఇందుకు మంత్రి అంబటి రాంబాబుసైతం తన వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రఘురామిరెడ్డి, మాజీ చైర్మన్ టి.కిషోర్, జెడ్పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచ్లు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళవారం సాయంత్రం) : 6.27

సహారీ (బుధవారం ఉదయం) : 4.38

ఆస్తి కోసం ఇంటివాళ్లే చంపబోయారు!

వ్యక్తిపై గొడ్డలి, రోకలితో తల్లిదండ్రులు, సోదరుని దాడి

ప్రజాశక్తి - నరసరావుపేట

ఆస్తి కోసం వ్యక్తిని అతని తల్లిదండ్రులతోపాటు తోడబుట్టిన సోదరుడూ హత్య చేసేందుకు పూనుకున్నారు. వారి నుండి తప్పించుకున్న బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నకరికల్లు మండలం దేచవరంలో సోమవారం జరిగిన ఘటనపై బాధితుని వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొండా శ్రీనివాసరెడ్డి తన మొదటి భార్య నుండి విడాకులు తీసుకున్నారు. మరో మహిళను కులాంతర వివాహం చేసుకున్న శ్రీనివాసరెడ్డి ▶ 2లో

బాధితుని వద్ద వివరాలు సేకరిస్తున్న సిఐ భక్తవత్సలరెడ్డి

ప్రశాంతంగా కొనసాగుతున్న పది పరీక్షలు 2లో

ప్రశాంతంగా కొనసాగుతున్న 'పది' పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు పల్నాడు జిల్లాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని. సోమవారం 4వ పేపర్ అయిన గణితం పరీక్ష నిర్వహించగా గుంటూరు జిల్లాలో 27101 మందికిగాను 26,877 మంది హాజరయ్యారు. 224 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పలు కేంద్రాలను, డిఇఒ, ఎంఇఒలు పలు పరీక్షా కేంద్రాలను, స్టోరేజి పాయింట్లను తనిఖీ చేసి, పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు.

పల్నాడు జిల్లాలో 126 కేంద్రాల్లో 25,363 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 24,989 (98.53శాతం) మంది హాజరయ్యారు, 374 మంది గైర్హాజరయ్యారు. ఈపూరు మండలంలోని రెండు పరీక్ష కేంద్రాలను పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ సందర్శించారు.

113 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చిలకలూరిపేటలోని బాలాజీ సినిమా హాలు రోడ్డు మార్గంలో అక్రమంగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యంను విజిలెన్సు ఎన్ఫోర్స్‌మెంట్ అదికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ప్రజా పంపిణీ లోని రేషన్‌ను 113 బస్తాల అక్రమ మార్గంలో రవాణా చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. యర్రంశెట్టి సుబ్బారావు, గొట్టిపాటి శంకర్, మురళి కష్ణ, సైదావలి, షేక్ ఇమామ్ బుడే, తదితరులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విజిలెన్సు సిఐ టి.లక్ష్మారెడ్డి, అసిస్టెంట్ జియాలజిస్ట్ ఎన్.ప్రసాద్ , స్థానిక రెవెన్యూ అధికారి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు నగరంపాలెంలో పోలీసులు సోమవారం రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఏటి అగ్రహారం, శ్రీరాం నగర్ రోడ్ వద్ద ఉదయం 11:00 గంటల సమయంలో రేషన్ బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. వెంగలాయపాలెం గ్రామానికి చెందిన తోకల లక్ష్మయ్య శ్రీరాం నగర్ ఏరియాలో జనాల వద్ద నుండి రేషన్ భియ్యం సేకరించి మూటలు కట్టి ఆటోలో ఎక్కిస్తుండగా 90 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

ప్రజావ్యతిరేక విధానాలపై 14 నుండి విస్తృత ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

పట్టుగొమ్మలుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారని, రైల్వేలు, టెలికం, ఎల్ఐసి, జిఐసి, విశాఖ ఉక్కు వంటి సంస్థలను అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. సహజ వనరులను సైతం కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారన్నారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మరోసారి తీరని అన్యాయం జరిగిందని, ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించలేదని గుర్తు చేశారు. ప్రజలకు ఉపాధి కల్పించే జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టానికి, కీలకమైన వ్యవసాయ రంగానికి, సంక్షేమ రంగానికి నిధులు కోత విధించారన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలకు విరుద్ధంగా, లౌకిక తత్వాన్ని మంటగలిపే చర్యలను చేపడుతుందని మండిపడ్డారు. రాష్ట్రాల హక్కులను హరిస్తూ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ కేంద్రం బాటలోనే రాష్ట్ర ప్రభుత్వమూ నడుస్తోందని, ఉద్యమాలపై నిర్బంధాన్ని ప్రయోగిస్తూ ఉద్యమకారుల గొంతు నులిమే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఆస్తిపన్ను పెంపు, చెత్తపన్ను వసూలు చేయడం, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగించే చర్యలను వ్యతిరేకించాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి, ఎన్.భావన్నారాయణ, ఎం.రవి, ఎస్ఎస్.చెంగయ్య, కె.నళినీకాంత్, జిల్లా కమిటీ సభ్యులు బి.కోటేశ్వరి, ఎల్.అరుణ, ఎంఎ.చిస్టీ, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలపై సమీక్ష

ప్రజాశక్తి - నరసరావుపేట

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎల్. శివశంకర్

అభివృద్ధి ,సంక్షేమ, పథకాలను సక్రమంగా అములు చేసి సకాలంలో పూర్తి చేయాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులు, ప్రత్యేకాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రీ సర్వే కార్యక్రమానికి సంబంధించి మెగా డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు 10,500 సరిహద్దు రాళ్ళ వేయించడానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూశాఖను ఆదేశించారు. సమావేశంలో 28 మండలాలకు కేటాయించిన అధికారుల కమిటీలో అభివృద్ధి పనుల్లో వెనుకబడిన 10 మండలాల అధికారులతో అనుసరించాల్సిన అంశాలపై మాట్లాడారు.ఆయుష్మాన్ భారత్ ఈ.కే.వై.సి. త్వరిత గతిన చేపట్టాలని సూచించారు. గ్రామ పంచాయతీ లకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు, గ్రామాలను మ్యాపింగ్ చేయాలన్నారు. ఆడపిల్లలో ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా పౌష్టిక ఆహారం అందించాలన్నారు. బాలికలు, యువతులు, గర్భిణీలలో రక్త హీనత తగ్గించడానికి తీసుకోవాల్సిన ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. హెచ్3, ఎన్2 ఇన్ ఫ్లూ ఎంజా వైరస్ విస్తరిస్తున్న నేపథ్యంలో జిల్లాలో తప్పని సరిగా ప్రతీ ఒక్కరూ మాస్కులు ధరించడం, సామాజిక దూరం పాటించడం, చేతులు తరచూ శుబ్రం చేసుకోవడం వంటి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, మండలాల అధికార్లు పాల్గొన్నారు.

సచివాలయంలో సిబ్బంది నిల్

- వేసిన తలుపులు వేసినట్టే...
- నిరాశతో వెనుదిరుగుతున్న స్థానికులు

ప్రజాశక్తి- మంగళగిరి

సోమవారం 8 వ వార్డులో మూసి ఉన్న సచివాలయం

పట్టణంలోని గాలిగోపురం ఎదట గల 8వ వార్డు సచివాలయంలో సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. ఈ సమస్య తరచూ తలెత్తుతూ ఉండటంతో వివిధ పనులపై వచ్చే ప్రజలు నిరాశతో వెను తిరగాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ప్రతిరోజు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వేసిన తలుపులు వేసినట్టే ఉంటున్నాయి. సోమవారం మధ్యాహ్నం 3-5 గంటల వరకు స్పందన అర్జీలు స్వీకరించాల్సి ఉండగా ఆ సమయంలో ఒకరిద్దరు ఉద్యోగులు తప్ప మిగిలిన సిబ్బంది అందుబాటులో లేరని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజల కోరుతున్నారు.

మున్సిపల్ మాజీ చైర్మన్‌ను కలిసిన కన్నా

ప్రజాశక్తి- సత్తెనపల్లి రూరల్

టిడిపి నాయకులు మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ సత్తెనపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామిని కన్నా లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం రామస్వామి గృహంలో వారు కన్నా లక్ష్మీనారాయణతో ప్రస్తుత రాజకీయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్' ప్రచారం

ప్రజాశక్తి- మంగళగిరి

పట్టణంలోని 5వ వార్డు సచివాలయంలో వైసిపి ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆప్కో చైర్మన్, వైసిపి రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షులు గంజి చిరంజీవి పాల్గొన్నారు. వైసిపి నాయకులు, కన్వీనర్‌లు సుష్మ ,మణికంఠ ఇంటింటికి తిరుగుతూ జగనన్న ప్రభుత్వంలో జరిగిన సంక్షేమాన్ని వివరించారు. మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్లను ఇంటి యజమానుల అనుమతితో ప్రతి ఇంటికి ప్రతి ఒక్క ఫోన్‌కి అంటిస్తున్నారు. కార్యక్రమంలో జంజనం వీరాస్వామి వార్డు అధ్యక్షుడు, డి.సాంబశివరావు, ఎం. గోవర్ధన్, చింతక్రింది గంగాధరరావు, టి.కోటేశ్వరరావు ,జి.పూర్ణ చంద్రరావు , పి.సాంబశివరావు, ఉప్పు మహేష్ , సాయి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు **పొన్నూరు రూరల్ :** పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆదేశాల మేరకు పొన్నూరు మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డ్‌లో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో 6వ సచివాలయం కన్వీనర్ పఠాన్.జానీ కొల్లేరు శ్రీనివాసరావు,ఈసాకు, వి.రమణ, బి నాగరాజు ,వాలంటీర్స్, గృహసారథులు; కార్యకర్తలు పాల్గొన్నారు.

మంగళగిరి రూరల్ : యర్రబాలేం గ్రామంలో వైసిపి ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆప్కో చైర్మన్, వైసిపి రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షులు గంజి చిరంజీవి పాల్గొన్నారు. పార్టీ నాయకులు కన్వీనర్ లు గృహసారథులు ఇంటింటికి తిరుగుతూ మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్లను ఇంటి యజమానుల అనుమతితో ప్రతి ఇంటికి, ఫోన్‌లకి అంటిస్తున్నారు. కార్యక్రమంలో జి. శ్రీనివాసరావు, పి. కోటేశ్వరరావు, వ్యాసం అజయ్ కుమార్, షేక్. గౌస్‌లు పాల్గొన్నారు. **తాడికొండ :** మండలలోని లామ్ గ్రామంలోని ఎస్‌సి కాలనీలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా పాల్గొని గడప గడపకు తిరిగి ప్రతి కుటుంబంలో పథకాలు అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ స్టికర్లను అంటించారు.ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, మండల కన్వీనర్ తల్ల శ్రీనివాసరెడ్డి , సచివాలయం కన్వీనర్ ఇమ్మానియెలు, నూర్జహాన్ కార్యకర్తలు, పాల్గొన్నారు

లాంలో పోస్టర్‌లను అందిస్తున్న హెన్రీ క్రిస్టినా

నెలాఖరు వరకూ సాగునీరివ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశానికి సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రామారావు అధ్యక్షత వహించగా రాధాకృష్ణ మాట్లాడుతూ ఖరీఫ్‌లో వరి సాగుకు వచ్చిన కొద్దిపాటి దిగుబడితో పాటు మద్దతు ధర దక్కడంతో ఈ ఏడాది రబీలో అధికంగా వరి సాగు చేపట్టారని, ప్రస్తుతం గింజ పాలుపోసుకునే దశలో ఉండగా ప్రభుత్వం మార్చి 31తో సాగునీటిని నిలుపుదల చేసిందని అన్నారు. దీంతో రబీలో వరి సాగు చేపట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని, ఏప్రిల్ చివరి వరకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మరో నెలలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో కౌలు రైతులను గుర్తించి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం భూ యజమాని అనుమతితోనే గుర్తింపు కార్డులు ఇస్తామని చట్టం చేసిన ఫలితంగా భూ యజమానులు నకిలీ కౌలురైతు గుర్తింపు కార్డులు సృష్టించి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఘటనలు పల్నాడు ప్రాంతంలో వెలుగు చూశాయని గుర్తు చేశారు. ఈ క్రమంలో కౌలురైతు సెల్ఫ్ డిక్లరేషన్ ఆధారంగా గుర్తించి కార్డులు మంజూరు చేయాలని, పంట రుణాలను వారికే దక్కేలా చూడాలని కోరారు. గ్రామ రెవెన్యూ, వ్యవసాయ శాఖ, రైతు సంఘాల ప్రతినిధులతో మానిటరింగ్ కమిటీ వేసి వాస్తవ సాగుదారులను గుర్తించాలని, రూ.25 వేలు రైతు భరోసాగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కె.ఆంజనేయులు, జి.పిచ్చారావు, టి.హనుమంతరావు పాల్గొన్నారు.

ఆస్తి కోసం ఇంటివాళ్లే చంపబోయారు!

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లో నివాసం ఉంటూ కారు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అయితే శ్రీనివాసరెడ్డి కులాంతర వివాహం చేసుకోవడం ఇష్టం లేని అతని తల్లిదండ్రులు, సోదరుడు కొద్దిరోజులగా అతన్ని ఒత్తిడి చేస్తున్నాడు. శ్రీనివాసరెడ్డి పేరుమీద ఉన్న ఆస్థిని అతని సోదరుడి పిల్లల పేరు మీద రాయాలని పదేపదే ఒత్తిడి చేస్తున్నారు. అయితే ఇందుకు శ్రీనివాసరెడ్డి అంగీకరించడం లేదు. ఈ క్రమంలో పొలం విషయంలో ఏదో వివాదం వచ్చిందని తెలుసుకున్న శ్రీనివాసరెడ్డి తన భార్యను తీసుకుని దేచవరానికి సోమవారం వచ్చారు. ఈ క్రమంలో అతనిపై తండి సీతారామిరెడ్డి, తల్లి సామ్రాజ్యం, తమ్ముడు కృష్ణారెడ్డి, వదిన కలిసి గొడ్డలి, రోకలి బండతో దాడికి దిగారు. తీవ్ర గాయాలపాలైన శ్రీనివాసరెడ్డి వారి నుండి తప్పించుకుని నరసరావుపేటకు చేరుకున్నాడు. తొలుత ఎమ్మెల్యేను సంప్రదించి తన సమస్యను విన్నవించి అనంతరం స్థానిక ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుని వద్ద సిఐ భక్తవత్సలరెడ్డి వివరాలు సేకరించి అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా నిందితులు నకరికల్లు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

బెజవాడ శ్రీను కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల మండలంలోని ప్రమాదంలో మరణించిన పశువేమల గ్రామానికి చెందిన బెజవాడ శ్రీను కుటుంబానికి పండ్ల మంగయ్య (మనోజ్)ఆర్థిక సాయం అందించి తన మానవత్వాన్ని చాటుకున్నాడు. వారి కుటుంబానికి రూ. 50 వేల ఆర్థిక సాయాన్ని అందించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. శ్రీనుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెద్దకుమారుడు వేణువర్ధన్(8),చిన్నకుమారుడు చైతన్య (6)ల చదువులకు అయ్యే ఖర్చులు కూడా అందిస్తామని పండ్ల మంగయ్య తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన న్యాయమూర్తి రత్నకుమార్

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

నెహ్రూ నగర్‌లోని కొత్తపేట మహిళా మండలి వృద్ధాశ్రమం గోడ ఆదివారం కూలడంతో వృద్ధురాలు, వాచ్‌మెన్ కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయాన్ని పత్రికల ద్వారా తెలుసుకున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ వైవిఎస్‌బిజి పార్థసారథి స్పందించారు. ఆశ్రమాన్ని పరిశీలించి ఘటనపై వివరాలు ఇవ్వాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నకుమార్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆశ్రమాన్ని రత్నకుమార్ సందర్శించి క్షతగాత్రులను పరామర్శించారు. ఆశ్రమంలోని వారితో మాట్లాడి వివరాలు సేకరించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, ఆశ్రమంలోని వారిని సురక్షిత భవనంలోకి మార్చాలని సూచించారు. పరిశీలనలో ఆశ్రమ డైరెక్టర్ పోతురాజు వెంకట్, న్యాయసేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాది కట్టా కాళిదాసు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కోర్టులో పని చేస్తూ కోవిడ్ కాలంలో చనిపోయిన ముళ్లపూడి శ్రీనివాస్ కుటుంబీకులు వస్త్రాలను ఆశ్రమంలోని వృద్ధుల కోసం సమకూర్చగా వాటిని జడ్జి కె.రత్నకుమార్ ద్వారా అందించారు.

జిల్లా జైలు సందర్శన

నగరంలోని జిల్లా జైలను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నకుమార్ సోమవారం సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి వారి ఆరోగ్యం, ఆహారం సదుపాయాలు తదితర అంశాలపై వివరాలు సేకరించారు. ఖైదీలకు అందించే భోజనాన్ని పరిశీలించడంతోపాటు పారిశుధ్య నిర్వహణపైనా ఆరా తీశారు. ఖైదీలకుగల హక్కులను వివరించడంతోపాటు సత్‌ప్రవర్తనతో మెలగాలని సూచించారు. న్యాయవాదిని నియమించుకునే స్తోమతలేనివారు జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదిస్తే ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. మే 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగిన కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా జైలు సిబ్బంది పాల్గొన్నారు.

క్షతగాత్రురాలితో మాట్లాడుతున్న జడ్జి రత్నకుమార్

అగ్ని ప్రమాదంలో రూ.15 లక్షలు నష్టం

3 పూరిళ్లు, మూడెకరాల గడ్డి వామి దగ్ధం

ప్రజాశక్తి - ముప్పాళ్ల

ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని మూడు పూరిగుడిసెలు, మూడు ఎకరాల గడ్డివాము అగ్నికి ఆహుతవడంతో ఆరు కుటుంబాలకు చెందిన వారికి దాదాపు రూ.15లక్షల ఆస్తి నష్టం జరిగింది. ప్రమాదం జ రిగిన సమయంలో ఇంళ్లల్లో ఎవరూ లెకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సోమవారం ముప్పాళ్ల మండలం రుద్రవరంలో చోటు చేసుకున్న సంఘటనను బాధితులు వివరించారు. గ్రామానికి చెందిన షేక్ సాయిబా,షేక్ ఘన్ బుడే, గోళ్ళ రమణమ్మ చెందిన కుటుంబాలు రోజు మాదిరిగానే ఉదయాన్నే పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చే సమయానికి ఒక గుడిసెకు నిప్పు అంటుకుని మండటాన్ని గమనించారు. ఎండ తీవ్రంగా ఉండటంలో క్షణంలోనే మంటలు వ్యాపించి పక్కనే ఉన్న రెండు గుడిసెలకు అంటుకున్నాయి. ఆర్పేలోపు మూడు గుడిసెలు కాలిపోయాయి. సత్తెనపల్లి నుండి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ మంటల్లో షేక్ సాయిబా దాచుకున్న రూ.2లక్షల నగదు, 4శవర్ల బంగారం, మూడు ఎకరాల గడ్డివాము దగ్ధం అవగా, షేక్ ఘన్ బడేకి చెందిన రూ.30వేలు నగదు, గోళ్ల రమణమ్మకు చెందిన గొర్రెలు అమ్ముకుని దాచుకున్న రూ.5లక్షల నగదు దగ్ధమయ్యాని బాధితులు తెలిపారు. కట్టుబట్టలతో రోడ్డు పాలయ్యామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులను తహశీల్దార్ పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.25కేజీలు బియ్యం అందజేశారు.

మోసం చేసినందుకు జగన్‌ను నమ్మాలా?

స్టిక్కర్ల రాజకీయంపై జనసేన నిరసన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అధికార పార్టీ కోట్ల రూపాయల దనాన్ని వధా చేస్తూ ఇంటి గోడలపై జగన్ రెడ్డి స్టిక్కర్లు అతికించడాన్ని వ్యతిరేకిస్తూ గుంటూరు లాడ్జి సెంటర్లో, అంబేద్కర్ విగ్రహం వద్ద జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు పిలుపు మేరకు సోమవారం ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు నిరసన వ్యక్తం చేశారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మనస్సాక్షిని చంపుకొని ఎమ్మెల్యేలు,మంత్రులు మెడలో పార్టీ సంచులు వేసుకొని ఇంటింటికి తిరుగుతూ గోడలకు స్టిక్కర్లు అతికించడం సిగ్గుచేటన్నారు. అందుకు వైసిపి నాయకులకు తాను సంతాపం తెలియజేస్తున్నామని అన్నారు. జగన్‌ను ప్రజలు ఎందుకు నమ్మాలని ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తానని విద్యార్థులను మోసం చేసినందుకా, దశల వారీగా మద్య నిషేధం అమలుకు తూట్లుపొడిచినందుకా, ఉద్యోగులకు సకాలంలోజీతాలు, రిటైర్డు అయిన వారికి పింఛన్లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టినందుకా అని ప్రశ్నించారు కార్యక్రమంలో నగర అధ్యక్షులు నేరేళ్ల సురేష్, అధికార ప్రతినిధి ఆళ్ల హరి తదితరులు మాట్లాడారు.

ప్రభుత్వ కాలేజీ స్థలంలో ఆక్రమణలకు పాల్పడవద్దు

ప్రజాశక్తి - మాచర్ల

1970లో ప్రభుత్వం ప్రభుత్వ భూమితో పాటు కొంత స్థలాన్ని సేకరించి స్థానిక ఎస్‌కెబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలజీకి కేటయించటం జరిగిందని తహశీల్దార్ రమేష్‌కుమార్ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రభుత్వం సేకరించిన స్థలంలో ప్రభుత్వ భూమితో పాటు పట్టా భూములు కూడ ఉన్నాయని తెలిపారు. సదరు స్థలానికి బౌండరీలు కూడ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ మధ్య కాలంలో కొందరు కాలేజీ స్థలాలలో తమకు పట్టాభూములు ఉన్నాయంటూ ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తున్నారని, ఎవరు ఆక్రమణలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సదరు కాలేజీ స్థలాలలో ఎవరికైనా తమకు భూములు ఉన్నట్లు అనుకుంటే సరైన పత్రాలు చూపించి, అధికారుల నుండి అనుమతులు పొందిన తరువాత స్థలంలోకి ప్రవేశించాలన్నారు. పట్టణ సిఐ బాలకృష్ణ మాట్లాడుతూ శాంతి, భద్రతలకు విఘాతం కలిగే విధంగా ఎవరైనా ప్రవిరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్.ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మేము ఎలాంటి కబ్జాలకూ పాల్పడలేదు

పట్టణంలో తాము ఎటువంటి స్థలాలను కబ్జా చేసేందుకు పాల్పడలేదని, మా స్థలం ఎక్కడో మాకు చూపించాలని ముస్లిమ్ సంఘ నాయకులు షేక్ సులేమాన్‌పాషా అన్నారు. స్థానిక షాదీఖానాలో సోమవారం జరిగిన పత్రికా విలేఖరుల సమావేశంలో సులేమాన్‌పాషా మాట్లాడుతూ 1953లో ముస్లిమ్ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి 12 సెంట్ల స్థలం ఉందన్నారు. సదరు భూమి తాలుకు పత్రాలను పలుమార్లు వివిధ స్థాయి అధికారులకు చూపించటం జరిగిందన్నారు. మసీద్ నిర్మాణం కోసం ముస్లిమ్ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి దానంగా భూమి అందజేసినట్లు వివరించారు. సదరు భూమి చూపించాలని పలుమార్లు ప్రయత్నం చేసినట్లు తెలిపారు. అధికారులు స్థలం చూపించటంలో విఫలం అయినందున మసీద్ నిర్మాణం కోసం ముందుకు వచ్చిన సంఘ పెద్దలు భూమి మీదకు వెళ్ళటం జరిగిందని సులేమాన్ తెలిపారు. మా భూమి ఒక వేళ కాలేజీ స్థల సేకరణ కు వెళ్ళినట్లు అయితే స్థల యజమానికి పరిహారం అందించాల్సి ఉంటుందని, అటువంటిది ఏమైనా జరిగిందా అని సులేమాన్ ప్రశ్నించారు. పరిహారం అందించి ఉంటే అధికారులు సదరు వివరాలు తమకు ఇవ్వాలని కోరారు. పరిహారం ఇవ్వనప్పుడు మా స్థలం మీదకు మేము వెళితే ఆక్రమణ ఆవుతుందా అని ప్రశ్నించారు. కొందరు నాయకులు ముస్లిమ్స్ భూ కబ్జాకు పాల్పడుతున్నట్లు మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కారం చేయాల్సి ఉందన్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

కుటుంబ కలహాలతో భర్త మరణించడాన్ని భరించలేని వివామిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం ఎంటిఎంసి పరిధిలోని ఆత్మకూరులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గత ఆరు నెలల క్రితం వేర్వేరు సామాజిక తరగతులకు చెందిన యువతీ, యువకులు వివాహం చేసుకున్నారు. కొద్ది కాలం క్రితం కుటుంబ కలహాలతో కొన్ని రోజుల క్రితం యువకుడు ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. ఈక్రమంలో భర్త చనిపోవడంతో ఎలా బ్రతకాలో తెలియక, ఆదరించే వారు లేక తీవ్ర మానసిక వత్తిడికి గురైన యువతి తన చావుకు ఎవరూ కారణం కాదని ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది.

30వ తేదీలోపు ఆస్థిపన్ను చెల్లిస్తే 5శాతం రాయితి

మున్సిపల్ కమిషనర్ ఇవి రమణబాబు

ప్రజాశక్తి - మాచర్ల

ఈ నెల 30వ తేదిలోపు ఆస్థి పన్ను చెల్లించి, 5శాతం రాయితీ పొందాలని మున్సిపల్ కమీషనర్ ఇవి రమణబాబు పన్ను చెల్లింపు దారులను కోరారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఇవి రమణబాబు మాట్లాడుతూ ఈ నెల 30వ తేదిలోపు నిర్మాణం చేసిన భవనాలకు, ఖాళీ జాగాలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆస్థి పన్ను చెల్లించినట్టైయితే వారికి ప్రభుత్వం 5శాతం రాయితీ ఇస్తుందన్నారు. ఈ నెల 30వ తేదీలోపు ఆస్థి పన్ను, నీటి పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకారం అందించటంతో పాటు పన్ను చెల్లింపుదారులు కూడ తమ డబ్బును ఆదా చేసుకోవాలని కోరారు.

చింతలపూడి ఛారిటబుల్ ట్రస్ట్ వితరణ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల : పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలో చింతలపూడి బ్రదర్స్ చింతలపూడి శ్రీనివాసరావు, డాక్టర్ అశోక్ కుమార్ చింతలపూడి ఆధ్వర్యంలో పల్నాడు హాస్పిటల్స్ 7వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పిడుగురాళ్ల పట్టణంలోని భాష్యం పబ్లిక్ స్కూల్, నారాయణ స్కూల్ విద్యాసంస్థలలో సోమవారం 10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు డాక్టర్ అశోక్ కుమార్ ఉచిత మజ్జిగ పాకెట్లను పంపిణీ చేశారు. తొలుత పల్నాడు హాస్పిటల్స్‌లో డాక్టర్ అశోక్ కుమార్ రమ్య హారిక దంపతులు కేక్ కట్ చేసి 7వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా అధ్యక్షులు కోట సాయి కుమార్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, హాస్పిటల్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE ADDL SENIOR CIVIL JUDGE COURT, NARASARAOPET.

Creditors insolvency petition NO. 24/23.

Between:-

Kasu Ranga Reddy ... Petitioner.

AND

1) Nalam Lakshman Rao ...Debitor.
2) Gundala Suresh Babu.
3) kota Bhagyalakshmi ...Respondents.

పై నెంబర్ I.P దావాలో పిటిషనర్ ఇందలి రెస్పాండెంట్స్ పై Creditor IP దాఖలు చేసి సదరు పిటిషనర్ తనకు రావలసిన బాకీ ని 1 వ ప్రతివాది నుండి రాబట్టుటకు దాఖలు చేసి ఉన్నారు. సదరు I.P లో ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు వారి ఎదుట ది. 27-04-2023 న ఉదయం 10:30 ని.లకు మీరు స్వయంగా కానీ న్యాయవాది గారి ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియపరుచుకోగలరు. ఈ పరోక్షమందు తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో వాయిదా 27-04-2023.

ఇట్లు.
చైకం చిన్నపరెడ్డి,
అడ్వకేట్, నరసరావుపేట.

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE, NARASARAOPET.

Insolvency petition NO. 21 OF 23.

Between..

Gatta Dileep Gupta (age 36) s/o Rambabu, R/o Chilakaluripet. ... Petitioner

AND

Asa Chandra & 8 Other's.... Respondents.

R1) Asa Chandra (age 50) s/o anjaneyulu D.No 34-255, C/o Siva Bar and Restaurant, X Road Center, Chilakalurupet Town & Mandal Palnadu Dt.

R2) Rohit Batra Schankar,(46)Prop Of Hella Infra Market Retail Pvt Ltd,Shagirilla Plaza,Off. No 47,IV floor,Road No.2, Banjara Hills, Hyderabad Town and CCC Limits, 500018.

R3) Arekatla Chandra (age 50) s/o Lakshmi Narayana, D.No,1-155, Mittapalli village, Chilakaluripet mandal, Palnadu Dt. 522616.

R4) Jillalelamudi Ashok(38) s/o Srimannarayana, Prop. Shanti Associates, Free Plaza, above State Bank of India, 3rd floor, Brindavan Gardens, Guntur town and Dt. 522 006.

R5) Are Katla swamy (Age 50) Lakshmi Narayana, D.No1-156, Mittapalli village, Chilakaluripet Mandal Palnadu Dt.522616.

R6) Voora Subrahmanyam (Age 44) Brahmam, Prop.Surya iron Traders, D.No 24-147, Bose Road, Chilakaluripet, Town & Mandal, Palnadu Dt. 522616.

R7) Gatta Anjaneyulu (age 48) Kotaiah, D.No 1-195B, Martur Post &Mandal, Bapatla Dt. 523301.

R8) Kolisetty Subrahmanyam, S/o Veeraiah, age 51, D.No 245-147, Near Anjaneya Swamy Temple,Subbiah Thota,Chilakaluripeta,Palnadu Dt.

R9) Kotha Tribhuvana Chand (age 43), s/o Nageswara Rao D.No 9-567, Beside AMG Hostel, Chilakaluripeta, town Mandal-522616

సదరు పై నెంబర్ పిటిషన్‌లో పిటిషనర్ తనను ఇన్సాల్వెంటుగా ప్రకటించమని ఇందలి రెస్పాండెంట్ల పైన ఐపి దాఖలు చేసియున్నారు. సదరు ఐపి లో ఏమైనా అభ్యంతరాలు ఉన్న యెడల ఈ ఐపి దావాలో చూపబడిన రెస్పాండెంట్స్ కాకుండా ఇంకా ఇతరులు ఎవరైనా ఉన్న యెడల శ్రీ కోర్టు వారి ఎదుట ది. 20-4-2023 వ తేదీన ఉదయం 10:30 నిమిషాలకు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల మీ పరోక్ష మందు తీర్మానించబడును.

వాయిదా తేదీ. 20-04-2023.

ఇట్లు.
జె.హనుమంతరావు
వై.శ్రీనివాసరావు.
పిటిషనర్ తరపు న్యాయవాది,
నరసరావుపేట, పల్నాడు జిల్లా.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

కలెక్టరేట్ 'స్పందన'కు 110 ఫిర్యాదులు

ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్పందన కాన్ఫరెన్సు హాల్ లో సోమవారం జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను అర్జీలను స్వీకరించి, పరిశీలించి వాటికి వెంటనే పరష్కార మార్గం చూపాలని పల్నాడు జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 110 వినతులను ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, డి.ఆర్.ఓ వినాయకం లు వాటిని సంబంధిత జిల్లా అధికారులకు పంపి వెంటనే పరిష్కరించాలని సూచించారు. కె.అంకారావు (జార్జి) రచించిన 'ప్రకృతి వైద్యం' అనే పుస్తకంలో కలెక్టర్ ఆవిష్కరించారు. అంకారావు నల్లమల అడవులు శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపడుతున్నారని చెప్పారు. స్పందనకు వచ్చి వెళ్ళే ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో నూతనం గా ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్‌లను కలెక్టర్ ప్రారంభిం చారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచారానికి మద్దతు తెలపండి

ప్రజాశక్తి-నరసరావుపేట

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాల పట్ల సిఐటియు ఆధ్వర్యంలో చేస్తున్న ప్రచార కార్యక్రమాలకు కార్మిక వర్గంతో పాటు ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు తెలపాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ పిలుపునిచ్చారు. నరసరావుపేట కోటప్ప కొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగిన సిఐటియు జిల్లా కమిటీ సమావేశానికి పల్నాడు జిల్లా అధ్యక్షులు కె. హనుమంత్ రెడ్డి వహించారు. ఈ సందర్భంగా ముజఫర్ అహమ్మద్ మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన మహా ధర్నా సందర్భంగా చేసిన వాగ్దానాలు తీర్మానాల సాధనకు రాబోయే కాలంలో దేశానికి దేశ ప్రజలకు దేశ సమగ్రతకు నష్టం కలిగించే విధానాల అవలంబిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 14 నుండి 30 వరకు అనేక వామపక్ష పార్టీలు ప్రజా తంత్ర వాదులు బిజెపి ప్రభుత్వ విధా నాలకు వ్యతిరేకంగా ప్రజల్లోకి వెళ్లి పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. సిఐటియు ఆల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు మే 1 నుండి సిఐటియు స్థాపక దినోత్సవం మే 30 వరకు నెల రోజుల పాటు బిజెపి ప్రభుత్వ మతోన్మాద విధా నాలకు వ్యతిరేకంగా నివాస ప్రాంతాల నుండి పని ప్రదేశాల వరకు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సిఐ టియు చేసే పోరాటాలకు కార్మిక వర్గంతో పాటు ప్రజలు మద్ద తు తెలపాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ఆంజనేయ నాయక్, జిల్లా ఉపా ధ్యక్షులు గుంటూరు విజయ్‌కుమార్, డి. శివకుమారి, బందగీ సాహెబ్, పేరుబోయిన వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్య ్దర్శులు జి. మల్లేశ్వరి, షేక్ సిలార్ మసూద్, హరిపోతురాజు ,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు ఫిర్యాదుల వెల్లువ

మెరుగైన రీతిలో అర్జీదారుల సమస్యలు పరిష్కారానికి స్పందన కార్యక్రమాన్ని నవీకరిస్తూ 'జగనన్నకు చెబుదాం' అనే నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పల్నాడు జిల్లా ఎస్పి వై.రవిశంకర్‌రెడ్డి అన్నారు. పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'జగన్నన్నకు చెబుదాం'లో పాల్గొన్న ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ సమస్యలకు సంబంధించి ప్రజల నుండి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. కుటుంబ, ఆర్థిక,ఆస్తి తగాదాలు మొద లగు సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా ప్రజల నుండి అందినట్లు ఎస్పి తెలిపారు. జిల్లా అద నపు ఎస్పీ(అడ్మిన్) జి. బిందుమాధవ్,డిఎస్పీలు విజయ భాస్కర రావు,ఆదినారాయణ,రవిచంద్ర,సిఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నరసరావుపేట

ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న తన భర్త తనను నిత్యం వేధింపులకు గురిచేస్తున్నాడని పిడుగు రాళ్లకు చెందిన వివాహిత మహిళ తన కుమారుడు, కుమార్తె తో వచ్చి ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

చోళ ఫైనాన్స్‌కు కంపెనీ సిబ్బంది తనకు రూ.5 లక్షలు రుణం మంజూరు చేస్తామని నమ్మించి రూ.13 వేలు తీసుకొని మోసం చేస్తున్నారని మరో ఫిర్యాదులో ఓ యువకుడు ఫిర్యాదు చేశాడు.

కులపెద్దల వద్ద తేల్చుకోమన్నారు

భర్త, అత్తమామలు వేధింపులు తాళ లేక చర్చి లో ఉంటూ అక్కడికి వచ్చి న వారు పెట్టింది తింటూ ఉంటున్నానని, అయినప్ప టికీ వారి వేధింపులు తనకు తప్పడం లేదని నకరికల్లు మండలం శివాపురం తం డాకు చెందిన లైలబాయి తన భర్త కృష్ణ నాయక్ పై ఫిర్యాదు చేశారు. నెహ్రూ నగర్ తండాకు చెందిన తనను ఐదేళ్ల క్రితం కృష్ణనాయక్‌కు ఇచ్చి వివాహం జరి పించారని, తమకు ఒక బాబు ఉన్నాడని చెప్పారు. తనపై అనుమానంతో అక్రమ సంబంధాలు అంటగడుతున్న తన భర్త నిత్యం మద్యం తాగొచ్చి కొడుతున్నాడని, అత్త మామలు కూడా ఆయనకు మద్దతు తెలుపుతున్నారని ఫిర్యాదు చేసింది. కన్న బిడ్డను చూసేందుకు కూడా ఇంటికి రాని వ్వడం లేదని, నకరికల్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే, కుల పెద్దల ద్వారా పం చాయతిలో పరిష్కరించు కోమని చెబు తున్నారని, తనకున్యాయం చేయాలని ఎస్పిని వేడుకున్నారు.

అర్చకత్వం కోసం సోదరుల వేధింపు

తమ పూర్వికులు నిర్మించిన శ్రీ లక్ష్మీ నర సింహస్వామి దేవస్థానం లో అర్చకునిగా చేస్తూ జీవనం సాగిస్తున్నానని, ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాలలో ఉం టున్న తమ సోదరులు వారికి అర్చకత్వం కావాలని వేధిస్తున్నారని మాచవరం మండలం మోర్జంపాడుకు చెందిన వికలాంగుడు హంసావతు రామానాయక్ ఫిర్యాదు చేశారు. తనను ఆలయంలోకి వెళ్లనీయకుండా తన సోదరులు తాళాలు వేస్తున్నారని, వారిని బతిమాలినా వినకపోవడంతో దాచేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని అయిన ఫలితం లేదని అన్నారు. రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో తన సోదరుల వైపు పోలీసులు మాట్లాడుతున్నారని ఎంపిపి దారం లచ్చిరెడ్డి ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు.

కూతురిని చంపుతానని బెదిరింపు

తన భర్త ఏడుకొం డలు మరో మహిళతో వివాహేతర సంబంధం పెటుకున్నాడని, తమ కుమార్తెను చంపుతానని బెదిరిస్తున్నాడని యడ్లపాడుకు చెందిన లక్ష్మీ మాధవి తన కుమార్తెతో వచ్చి ఫిర్యాదు చేశారు. తన భర్త రొంపిచర్ల మం డలం అన్నవరానికి చెందినవాడని తెలి పారు. కొన్నేళ్ల క్రితం లివర్ వ్యాధి సోకి తమ కుమారుడు మృతి చెందాడని, అప్ప టి నుండి మగ సంతానం కావాలని మరో వివాహం చేసుకునేందుకు కుట్రలు పన్ను తున్నారని ఆరోపించారు. హైదరాబాద్ లో ఉంటూ అక్కడ మరో మహిళను వివాహం చేసు కున్నాడని తమ బంధువులు చెప్పా రని తెలిపారు. ఈ విషయమై యడ్ల పాడు, రొంపిచర్ల, నరసరావుపేట పోలీస్ స్టేష న్లలో ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని తెలిపారు. అనారోగ్యంతో ఉన్న తన తల్లి దండ్రులకు భారం కావడం ఇష్టం లేక పాచిపనులు చేసుకుంటూ కుమార్తెను చది వించు కుంటున్నానని, తనకు న్యాయం చేయాలని కోరారు.

ఇంటిపత్రాలను సొంత అక్కే కాజేసింది

తోడ పుట్టిన అక్క తన ఇంటిని కాజేయలనే ఉద్దేశ్యంతో అవిటివాడిని అని కూడా చూడకుండా ఇంటి పత్రాలు కాజేసి ఇబ్బం దులు పెడు తున్నారని యడ్లపాడు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని మద్రి పాలెంకు చెందిన రావూరి రమేష్ బాబు ఫిర్యాదు చేశారు. తన భార్య అనారోగ్యంతో మృతి చెందిందని, తన కుమార్తెకు వివా హం చేసి అదే ఇంటిలో ఉంటున్నానని, పోషణ కోసం బ్యాంక్ లోను కోసం పత్రాలు ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు.

ఇంటి యజమాని ఇబ్బంది పెడుతున్నాడు

అనారోగ్యం పాలైన తాను అద్దెకుతీసుకున్న ఇం టికి 3 నెలల పాటు రాక పోవడంతో, ఇంటి యజ మాని సురేష్ తనను ఇబ్బ ంది పెడుతున్నాడని పిడుగురాళ్లకు చెందిన చిలకా చినమరియమ్మ ఫిర్యాదు చేశారు. పిడురాళ్లలోని లెనిన్ నగర్‌లో తాను అద్దెకు తీసుకున్నానని, అద్దె చెల్లిం చినప్పటికీ, తాను ఒంటరి మహిళను అనే భావనతో దుర్భాషలాడుతున్నాడని ఆరో పించారు. ఇంట్లో సామాను బయట పడేసి, కొన్నింటిని ఇవ్వకుండా ఇబ్బం దులు పెడుతున్నారని, పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినా న్యాయం జంగక పోవడంతో ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వట్లేదు

అపహరణకు గురైన తన ద్విచక్రవాహనానికి సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీని ఇవ్వమని ఎన్ని సార్లు కోరినా నరసరావు పేట పోలీసులు ఇవ్వడం లేదని ఇక్కుర్తి గ్రామానికి చెందిన ఇక్కుర్తి కృష్ణ ఫిర్యాదు చేశారు. నరసరావు పేట మండలం ఇక్కుర్తిలో తన ద్విచక్ర వాహనం అపహరణకు గురవడంతో నరసరావుపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశానని చెప్పారు. అపహరణకు గురైన తన వాహనం బాపట్ల జిల్లా మార్టూరు పోలీసులకు దొరికిందని, ఎఫ్ఐఆర్ కాపీ తీసుకురమ్మని వారు చెప్పారని పేర్కొన్నారు.

పొలం ఆక్రమణ పై ఫిర్యాదు

వారసత్వంగా పొందిన 3.06 సెంట్ల భూమిని తాను స్థాని కంగా లేక పోవడాన్ని అలుసుగా తీసుకున్న ఈపూరు మండలం బొమ్మరాజుపల్లికి చెందిన గోగసాని వెం కయ్య, విప్పర్ల నాగరాజు రాజ కీయ అండదండలతో కాజేసేందుకు పన్నాగం పన్నారని గుంటూరుకు చెందిన సూరేపల్లి అనసూయమ్మ ఫిర్యాదు చేశారు. నాలుగేళ్లుగా పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నా తనకు న్యాయం జరగలేదని తెలిపారు.

కానిస్టేబుల్ భర్త సోదరిని వేధిస్తున్నాడు

ఆరు నెలల క్రితం తన సోదరిని పెద్దల సమక్షంలో రెండో వివాహం చేసుకున్న గుంటూరుకు చెందిన క్లూస్ టీం కానిస్టేబుల్ ఎండి నురుల్లా తన సోదరిని వేధింపులకు గురి చేస్తున్నారని నరసరావుపేటలోని ఇస్లాం పేటకు చెందిన షేక్ మౌలాలి తన సోద రితో వచ్చి ఫిర్యాదు చేశారు. సోదరి భర్తను ఇదేమని ప్రశ్నిస్తే తనను ఎవరూ ఏమీ చేయలేరని, ఎవరికి భయపడనని చెబు తున్నాడని తెలిపారు. కేసు పెట్టిన పోలీస్ స్టేషన్లలో పైఅధికారులను బతి మాలుకొని కేసులు లేకుండా బయట దర్జాగా తిరుగుతున్నాడని పేర్కొన్నారు. మొదటి భార్యను వేధింపులపాలు చేసి చం పేసి ఆమె అనారోగ్యంతో మృతి చెందినట్లు తమను నమ్మించి మోసం చేసి, తన సోదరిని వివాహం చేసుకుని, ఇప్పుడు వదిలించుకోవాలని చూస్తున్నారని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు.

పోలీసులు పట్టించుకోవట్లేదు

స్థలం విషయంలో జరిగిన గొడవలో హనుమంతరెడ్డి, వెంకటరెడ్డి, కోటిరెడ్డిలు తనపై తన భార్యపై దాడి చేసి సెల్ ఫోన్, 3 సవర్ల బంగారు గొలుసు అపహరించాని రొంపి చర్ల మండలం నల్లగార్లపాడుకు చెందిన అచ్చి అంకిరాజు లక్ష్మీ దివ్య దంపతులు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై రొంపిచర్ల పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టిన తర్వాత తన సెల్‌ఫోన్ ఇచ్చారే తప్ప బంగారం గొలుసు ఇవ్వలేదని, పోలీసులు పట్టించుకోకపోవ డంతో ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

తీసుకున్న డబ్బు ఇవ్వమంటే దాడి

.మంచితనం నటిస్తూ తన వద్ద నగదును తీసు కున్నారని, తిరిగి అడిగి నందుకు తనపై దాడి చేసి బెది రిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని నరసరావు పేటలోని శ్రీనివాస డీలక్స్ సమీపంలో నివసిస్తున్న వికలాంగుడు కొత్తూరి ప్రసాద్ ఫిర్యాదు చేశారు. ఒంటరిగా జీవిస్తున్న అతను, మృతి చెందిన తన తల్లి బంగారు ఆభరణాలు విక్రయించి ఆ డబ్బుతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అదే ఇంటికి సమీపంలో రెండేళ్ల క్రితం సత్తెనపల్లి నుంచి వచ్చిన గోపి, సలోమి దంపతులు అద్దెకు దిగారు. ప్రసాద్ వద్ద డబ్బులు ఉన్నాయని గ్రహించిన వారు అతనితో మంచిగా నటిస్తూ తనకు కావాల్సినవన్నీ చేసి పెడుతూ ఆయన వద్ద ఉన్న డబ్బుని అప్పుగా తీసుకున్నారు. తిరిగి తన డబ్బు తనకి ఇవ్వమని అడిగితే తనపై దాడి చేసి దూషించారని, చంపు తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. తనకు వారి నుంచి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని ఆ ఫిర్యాదులో కోరారు.

అమరావతి మేజర్‌కు నీరివ్వండి

ప్రజాశక్తి-పెదకూరపాడు

అమరావతి మేజర్‌కు సాగునీరు ఇవ్వాలని రైతు సంఘం పెదకూరపాడు మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దారు క్షమారాణికి వినతిపత్రం అందజేశారు. గత మూడేళ్ల నుంచి పంటలు అనుకూలంగా లేవని, ఈ ఏడాది మాత్రమే మిరప కొంచెం అనుకూలంగా ఉందని, ఏప్రిల్ ఆఖరి వరకు సాగునీరు అందిస్తే మరో మూడు నాలుగు క్వింటాలు దిగుబడి వచ్చే అవకాశం ఉందని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. పంటలను కాపాడేందుకు సాగునీరు ఇవ్వాలని కోరారు. ఈ విషయాన్ని పైఅధికారులకు తెలియజేస్తామని రైతులకు తహశీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి డిఎస్ రావు, అజిముల్లా, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు కోత విధిస్తున్న ప్రభుత్వం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు ఇచ్చే సంక్షేమ పథకాలకు అనేక షరతులు విధిస్తూ కోత విధిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పేర్కొన్నారు. పాతగుంటూరులోని ఆంజనేయస్వామి గుడివీధి, యాదవుల బజారులో సిపిఎం నాయకులు సోమవారం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పన్నుల భారాలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిత్యవసరాలు ధరల పెరుగుదలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ విలువ ఆధారంగా ఆస్తి పన్నును ప్రతి ఏడాది పెంచడంతో పాటు, చెత్త సేకరణ పన్ను వసూలు చేయడం సరికాదన్నారు. పెరిగిన గ్యాస్‌ధర, విద్యుత్ చార్జీలు ప్రజలకు గుదిబండలా మారాయని ప్రజలు వాపోతున్నారని వెల్లడించారు. వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ కోసం సకాలంలో డిమాండ్ నోటీసు ఇవ్వకపోవడంతో వ్యాపారులు అపరాధ రుసుముతో సహా చెల్లించాల్సి వస్తోందని, సకాలంలో డిమాండ్ నోటీసులు ఇవ్వాలన్నారు. జగనన్న కాలనీలలో నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు ఇళ్ళను అందజేయాలని బాబూరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, జిల్లా, నగర నాయకులు దండా లక్ష్మీనారాయణ, లక్కా అరుణ, ముత్యాలరావు, ఎస్.కార్తీక్, ఆదినికల్సన్, గంగాధరరావు, కె.శ్రీనివాస్, మురళీకష్ణ, కృష్ణకుమారి, ఖాసింవలి తదితరులు పాల్గొన్నారు.

పాతగుంటూరులో ప్రజలతో మాట్లాడుతున్న బాబూరావు

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

కలెక్టరేట్‌లో స్పందనకు 134 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

స్పందన కార్యక్రమంలో అందిన ఫిర్యాదులను నాణ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, డిఆర్ఓ కె.చంద్రశేఖర్‌రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం.వెంకట శివరామిరెడ్డి, డిప్యూటీ కలెక్టర్ లలితా తదితరులు ప్రజల నుండి 134 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలని, అలాగే ఏపిసేవ ద్వారా అందిన సర్వీసులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. జిల్లా కేంద్రంలోని అధికారులు, సిబ్బందికి ఈ నెల 15, 16 తేదీల్లో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని కార్పొరేట్ హాస్పిటల్స్ ద్వారా అత్యాధునిక పరికరాలతో బాడీ జనరల్ చెకప్ కలక్టరేట్ వద్ద ఏర్పాటు శామన్నారు. మొదటిగా జిల్లా ప్రధాన స్థానంలో జిల్లా అధికారులు మరియు వారి సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, అలాగే తదుపరి డివిజన్, మండల, గ్రామ స్థాయిలలో కూడా ఉద్యోగులందరికి వైద్య పరీక్షలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సిఈఓ మోహనరావు, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ హరిహరనాథ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మోవిడివాణి, సాయిశ్రీ, డిపిఓ కేశవరెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి మధుసూధనరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న నాయకులు

కలెక్టర్‌కు వినూత్నంగా వినతి

ఏపీ జెఎసి అమరావతి ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక, పెన్షనర్ల కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు సోమవారం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా జిల్లా నాయకులు స్పందనలో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు వినూత్నంగా నల్లమాస్కులు ధరించి, కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక, ఆర్థికేతర డిమాండ్ల సాధనకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్లు కార్మికలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెఏసీ అమరావతి జిల్లా అధ్యక్షులు కె.సంగీతరావు, రాష్ట్ర క్లాస్‌ఫోర్ అధ్యక్షులు మల్లేశ్వరరావు, జిల్లా పెన్షనర్ల సంఘం కార్యదర్శి సిహెచ్.వెంకటేశ్వర్లు, పాపారావు, డ్రైవర్ల సంఘం అధ్యక్షులు సిహెచ్.కొండయ్య, రెవెన్యూ ఉద్యోగులు, పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ క్వాంటమ్ పెన్షన్ విడుదల చేయాలని వినతి

ఆలిండియా రాష్ట్ర పెన్షనర్ల సమాఖ్య పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద నిరసన ప్రదర్శనలు, ప్రధాన మంత్రికి కలెక్టర్ల ద్వారా పెన్షనర్ల డిమాండ్లపై వినతులు అందచేయటంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్‌కు స్పందనలో సంఘం నాయకులు వినతిపత్రం అందచేశారు. గుర్తించిన వైద్యశాలలో నగదురహిత వైద్యం అందించాలని, 2018 జులై నుండి రావాల్సిన డిఎ బకాయిలు విడదల చేయాలని, 2022 జనవరి, జులై, 2023 జనవరికి కేంద్రం విడుదల చేసిన డిఎలు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా విడుదల చేయాలని, అడిషనల్ క్వాంటమ్ పెన్షన్ పిఆర్‌సిలో 3 శాతం తగ్గించిన మొత్తాన్ని తిరిగి పరిష్కరించాలని, 65 ఏళ్ల నిండిన తర్వాత అడిషనల్ క్వాంటమ్ పెన్షన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెన్షన్ కమ్యూటెడ్ వ్యాల్యూ 15 ఏళ్ల నుండి 12 ఏళ్లకు తగ్గించాలని, పెన్షనర్లను ఇన్‌కం ట్యాక్స్ నుండి పూర్తిగా మినహాయించాలని, సిపిఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని, అనేక డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందచేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.నాగరాజు, పెన్షనర్స్ వాయిస్ పత్రిక చీఫ్ ఎడిటర్ టి.శ్రీనివాసరావు, కె.మురళి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

ఆంగ్ల సాహిత్యానికి వన్నె తెచ్చిన వర్డ్స్‌వర్త్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక హిందూ కాలేజిలో సోమవారం ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో సుప్రసిద్ధ ఆంగ్ల కవి విలియం వర్డ్స్ వర్త్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. సభకు ఆంగ్ల శాఖ అధ్యక్షులు డాక్టర్ అందె బాలశౌరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఆంగ్ల అధ్యాపకురాలు హేమమాలిని విలియం వర్డ్స్ వర్త్ రచనలు, జీవిత విశేషాలను వివరించారు. వర్డ్స్ వర్త్ ప్రకృతిపరంగా కవిత్వం రాసి, రొమాంటిక్ కవిగా ఆంగ్ల సాహిత్యంలో స్థిరస్థానం సాధించాడన్నారు. ప్రకృతికి భాష లేకపోయినా చూసిన అందర్నీ అనుభూతికి లోను చేసి, పలకరిస్తూ పులకరింపు చేస్తుందన్నారు. భూమ్మీద ప్రకృతి ఉన్నంతకాలం వర్డ్స్ వర్త్ అందరికీ గుర్తుంటారన్నారు. ఆయనను చాలా మంది అనుసరించి, అద్భుతమైన రొమాంటిక్ కవిత్వం రాశారన్నారు. కార్యక్రమంలో ఇ.సుడేర్సన్, కళాశాల సెక్రెటరీ చెరువు రామకృష్ణమూర్తి, ఆంగ్ల అధ్యాపకురాలు చిలకా అరుణ, బ్యూలారాణి, డాక్టర్ మేజర్ చుక్కా నవీన్‌కుమార్, ప్రిన్సిపాల్ పిఎం ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కెవిఎస్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం హేమమాలిని రాణిని సన్మానించారు.

హేమమాలిని రాణిని సన్మానిస్తున్న రామకృష్ణమూర్తి, తదితరులు

జిఎంసి స్పందనకు 38 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు : ప్రజల నుండి సమస్యలపై అందే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరిం చాలని, పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. సోమవారం జిఎంసి కాన్ఫరెన్స్ హాల్లో స్పందన నిర్వహించారు. కమిషనర్ తొలుత గతవారం స్పందన ఫిర్యాదుల పరిష్కారం, స్పందనపోర్టల్, ఈఆర్‌పి., వాట్స్అప్, కాల్‌సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదులపై అధికారులతో, సంబంధిత కార్యదర్శులతో సమీక్షించారు. అనంతరం ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. పట్టణ ప్రణాళిక విభాగం 13, ఇంజినీరింగ్ విభాగం 10, ప్రజారోగ్య విభాగం 2, రెవెన్యూ విభాగం 10, ఉపా సెల్ విభాగం 2, అకౌంట్స్ విభాగం 1, పరిపాలన విభాగం 2, మొత్తం 38 ఫిర్యాదులు అందాయని అన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, ఎస్.ఈ. భాస్కర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న నగర కమిషనర్ కీర్తి చేకూరి

పోలీసుల అదుపులో బాలుడు

ప్రజాశక్తి- తెనాలి

మూగ, చెముడు, శరీరంపైన చిన్న చిన్న గాయాలతో ఉన్న 16 సంవత్సరాల బాలుడు పోలీసులు అదుపులో ఉన్నాడు.తెనాలి రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం గ్రామస్తుల సమాచరంతో బధిర బాలుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు. అతనిని విచారించినా ఏమీ సమాచారం తెలిపడం లేదని చెప్పారు. బాలుడు బ్లూకలర్ నెక్ టి షర్ట్, హాఫ్ షాట్ ధరించి ఉన్నాడని, చెప్పులు కూడా లేని పరిస్థితిలో ఉన్న బాలుడి వివరాలు తెలిసిన యడల పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ ఐ తెలిపారు.

రోడ్డుపై వేసిన మట్టిని తొలగించరా..

ప్రజాశక్తి - తెనాలి

నిత్యం రద్దీగా ఉండే పట్టణంలోని మహాత్మా గాంధీ మునిసిపల్ మార్కెట్‌లో అంతర్గత రోడ్డు పరిస్థితి దయనీయంగా ఉంది. సిమెంట్ రోడ్డు నిర్మించి, దానికి నీళ్ల పెట్టేందుకు గదులుగా కట్టిన మట్టిని తొలగించకుండా వదిలేశారు. ఆ మట్టి అంతా గుట్టలుగా చేరి వినియోగదారులకు, ఆ ప్రాంతంలోని వ్యాపారులకు తీవ్ర అసౌకర్యంగా ఉంది. మార్కెట్లో చెత్తను తరలించేందుకు వచ్చే చెత్త సేకరణ వాహనాలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అక్కడ వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. సాక్షాత్తు మున్సిపల్ కార్యాలయం ఎదురుగానే మున్సిపల్ మార్కెట్లో పరిస్థితి దయనీయంగా ఉండటానికి అధికారుల అలసత్వమే కారణమని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.

విద్యారంగానికి సిఎం అధిక ప్రాధాన్యం

జగనన్నే మన భవిష్యత్తుపై గుంటూరులో భారీ ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో విద్యా రంగం అభివృద్ధికి సిఎం జగన్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి చైతన్య అన్నారు. విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జగనన్నే మన భవిష్యత్తు అని నినదిస్తూ సోమవారం గుంటూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. లాడ్జిసెంటర్ నుంచి హిందూ కాలేజ్ సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. చైతన్య మీడియాతో మాట్లాడుతూ బడికి పంపే పిల్లలకు అమ్మఒడి, విద్యా దీవెన, విద్యాకానుక,నాడు-నేడు, వసతి దీవెన, విదేశీ విద్య తదితర పథకాల ద్వారా నాణ్యమైన విద్యను నిరుపేదలకు సైతం అందిస్తూ సిఎం జగన్ తల్లిదండ్రులకు అండగా నిలుస్తున్నారని అన్నారు. విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్, రీజనల్ కోఆర్డినేటర్ విఠల్, విద్యార్థి నేతలు రవి, గంటి, బాజి, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరులో స్పందనకు 9 అర్జీలు

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరు తాసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో 9 అర్జీలు అందినట్లు తాసిల్దార్ శ్రీకాంత్ కేదార్నాథ్ తెలిపారు. ఇంటి హద్దు సమస్య, రేషన్ కార్డ్ క్యాన్సిల్, అడంగల్ వన్ బి అర్జీలతో పాటు నివేశన స్థలం, రేషన్ కార్డు ఆధార్ డీటెయిల్స్ తెలియజేయాలని అర్జీలు అందినట్లు తాసిల్దార్ తెలిపారు. అర్జీలను పరిశీలించి సంబంధిత శాఖకు పంపి సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తాసిల్దార్ శ్రీకాంత్ కేదార్నాథ్ తెలిపారు కార్యక్రమంలో ఎంపీడీవో భవనం మారుతి శేషమాంబ, ఆర్ ఐ రామకృష్ణ డిప్యూటీ ఎమ్మార్వో వాసు, మండల స్థాయి అధికారులు అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడమే ప్రథమ కర్తవ్యం

ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించిన కలెక్టర్ శివశంకర్

ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లా కలెక్టర్ సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్పందన హాల్ లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (స్పందన) కార్యక్రమంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రజా, ప్రభుత్వ విధుల్లో పనిచేస్తున్న ఉద్యోగులతో ప్రత్యేక పద్ధతిలో కలెక్టర్ శివశంకర్ ప్రతిజ్ఞ చేయించారు. తాను పనిచేస్తూ తోటి ఉద్యో గులందరిలో స్ఫూర్తిని నింపేలా పల్నా డు జిల్లాను ప్రగతి పథంలోకి తీసుకువెళ్ళేం దుకు ఈ తరహా వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. 'ప్రజలకు సేవ చేయడమే నా ప్రథమ కర్తవ్యంగా భావించి నేను ప్రభుత్వ ఉద్యోగంలో చేరానని భావిస్తున్నాను. 'విధి నిర్వహణలో సరైన నైతికతను పాటించక పోవడం ద్వారా కలిగించేలా చేయుట పాపమని భావిస్తున్నాను. 'ఇది నిర్వహణలో భాగంగా ప్రజలు సమస్యల పరిష్కారానికై కార్యాలయానికి వచ్చిన వెంటనే, పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తాను'... 'ప్రతి వారము ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలను అను సరించి జిల్లా కలెక్టర్ వారిచే నిర్దేశించబడిన లక్ష్యాన్ని సాధించడానికి, నా యొక్క పూర్తి సామర్థ్యాన్ని లక్ష్యాన్ని చేరుకుంటాను అని ప్రతిజ్ఞ చేస్తున్నాను' అంటూ కలెక్టర్ తన ప్రతిజ్ఞ ప్రసంగాన్ని ముగించారు. కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, జిల్లా ఉన్నతాధి కారులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలపై మాన్యువల్ బుక్‌లెట్ ఆవిష్కరణ

పల్నాడు జిల్లా డాక్టర్ వై ఎస్ ఆర్ ఆరోగ్యశ్రీ ట్రైనింగ్ మాన్యువల్ బుక్‌లెట్‌ను కలెక్టర్ సోమవారం ఆవిష్కరిం చారు. జిల్లాలోని ఆరోగ్య మిత్రలకు సచి వాలయం ఎఎన్ఎం లకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందిస్తున్న సేవల వివరాల పై పూర్తి అవగాహన కల్పించేందుకు ఈ బుక్ లెట్ దోహదం చేస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో 602 మంది సచివాలయం ఎఎన్ఎంలకు, 67 మంది నెట్వర్క్ హాస్పిటల్ ఆరోగ్య మిత్రలకు, టీం లీడర్ల ద్వారా వీటిని అందజేస్తామని అన్నారు. ఎఎన్ఎం, ఆరోగ్య మిత్రలు విధులు, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అంది స్తున్న వైద్య సేవల వివరాలను సమగ్రంగా ఇందులో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఈ బుక్ లెట్స్ ను క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలకు ఆరోగ్యశ్రీ పథకం పై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్. పి. సునీలా, డీఎం.హెచ్.ఓ జి. శోభారాణి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా 48 సిట్టింగ్ స్క్వాడ్స్: డిఇఒ

ప్రజాశక్తి-ఈపూరు

పదో తరగతి పరీక్షలు పటిష్టంగా జరి పేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపడు తున్నట్లు పల్నాడు జిల్లా డీఈవో కె.శామ్యూల్ అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో డీఈవో మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా జరుగు తున్నట్లు చెప్పారు. కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 48 సిట్టింగ్ స్క్వాడ్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ లతో పర్యవేక్షణ ఉంద న్నారు. జిల్లాలో ఏదో ఒక పరీక్ష కేంద్రాన్ని సందర్శించి ప్రత్యేక పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షల ప్రారంభ సమయంలో ఒకటి రెండు చోట్ల ఇబ్బందులు తలెత్తాయని వాటిని పరిష్కరించామన్నారు.

గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా బాలునాయక్

ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లాకు చెందిన జిల్లా క్రాంతి పథం ప్రాజెక్ట్ డైరెక్టర్ బాలు నాయక్ కు రాష్ట్ర గిరిజన ఉద్యోగుల సంఘంలో వర్కింగ్ అధ్యక్షులుగా ఎన్నికైనట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. విశాఖపట్నంలో ఇటీవల జరిగిన అఖిల భారత గిరిజన ఉద్యోగ సంఘాల సర్వసభ్య సమావేశం జరిగిందని పేర్కొంది. విశాఖపట్నం లోని ఆంధ్రా యూనివర్సిటీ లో మూడవ సర్వ సభ్య సమావేశానికి జాతీయ అధ్యక్షులు పి వి రమణ, జాతీయ జనరల్ సెక్రటరీ హరి రామ్ నాయక్ లు హాజరయ్యారని తెలి పారు. ఈ సమావేశంలో గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని తెలిపింది. రాష్ట్ర గిరిజన ఉద్యోగుల ఎన్నికలలో ఏపీ స్టేట్ వర్కింగ్ ప్రెసి డెంట్ గా పల్నాడు ప్రాజెక్ట్ డైరెక్టర్ బాలు నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశకి-నరసరావుపేట

రావిపాడు రోడ్డు శాంతినికేతన్ బైపాస్ రోడ్డు నుండి రెడ్డినగర్ వరకు నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపిపి ఎం. శ్రీనివాసరావు,జెడ్పీటీసీ చిట్టిబాబు, రెడ్డినగర్ నాయకులు కార్య కర్తలు పాల్గొన్నారు. అనంతరం 4వ వార్డు పనస తోటలో వైసిపి ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలోఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

30వ తేదీలోపు ఆస్తి పన్ను చెలిస్తే 5 శాతం రాయితి

ప్రజాశక్తి-మాచర్ల

ఈ నెల 30వ తేదీలోపు ఆస్తి పన్ను చెల్లించి, 5 శాతం రాయితి పొందాలని మున్సిపల్ కమిషనర్ ఇవి రమణబాబు పన్ను చెల్లింపుదారులను కోరారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మాట్లాడుతూ 30వ తేదీ లోపు నిర్మాణం చేసిన భవనాలకు, ఖాళీ జాగాలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను చెల్లించినట్లయితే వారికి ప్రభుత్వం 5 శాతం రాయితి ఇస్తుందన్నారు. ఈ నెల 30 లోపు ఆస్తి పన్ను, నీటి పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకారం అందించడంతో పాటు పన్ను చెల్లింపుదారులు కూడా తమ డబ్బును ఆదా చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే పిన్నెల్లికి కేజీబీవీ సిబ్బంది వినతి

ప్రజాశక్తి - రెంటచింతల: బాలికలను విద్యాపరంగా ప్రోత్స హిం చేం దుకు ప్రవేశపెట్టిన కస్తూర్బా గాంధీ విద్యా లయాల్లో 2023- 24 నుంచి రాష్ట్ర సిలబస్, సీబీఎస్ఈ ప్రవేశపెట్టనున్నట్లు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. నియోజక వర్గంలోని రెంటచింతల,కారంపూడి,దుర్గి, మాచర్ల మండలాల్లోని కేజీబీవీలో పనిచేసే సిబ్బంది రెంటచింతల ఎంపీడీవో కార్యా లయంలో సోమవారం ఎమ్మెల్యేను కలిసి గత రెండు నెలలుగా తమకు జీతాలు రావడం లేదని చెప్పారు. వెంటనే విద్యా శాఖమంత్రి బొత్స సత్యనారాయణతో చర్చించి సమస్యను రెండు మూడు రోజుల్లో పరిష్కరిస్తామని వారికి ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 352 కేజీ బీవీ లు ఉండగా జిల్లాలో 24 దాకా ఉన్నాయన్నారు .ఆరో తరగతి నుంచి ఇంటర్ ఫస్టియర్ లో చేరాలనుకునే వారు ఈ నెల 20 తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రెంటచింతల మండలంలోని కేజీబీవీలో 1.6 కోట్లతో చేపట్టిన జూనియర్ కాలేజీ నిర్మాణం పూర్తయిందని, త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు.

రూ.2 లక్షలు గుడ్‌విల్‌తో షాపులు కేటాయించాలి

ప్రజాశక్తి-వినుకొండ: ఎన్ఎస్పి స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి ఒక్కొ క్క షాపునకు రూ.14 లక్షలు వసూళ్ల చేయడం నిలిపివేయాలని, రూ.2 లక్షల గుడ్ విల్‌కు షాపులు కేటాయించాలని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవి ఆంజ నేయులు డిమాండ్ చేశారు. జిఒ146కు వ్యతిరేకంగా జరుగుతున్న నిర్మా ణాలను టిడిపి వ్యతిరేకిస్తూ సోమవారం టిడిపి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. టిడిపి కార్యాలయం నుండి నరసరావుపేట రోడ్డు, శివయ్య స్తూపం సెంటర్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సి పల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. 46 జిఒ ప్రకారం ఎన్ఎస్పి స్థలంలో నిర్మాణాలు చేపట్టకపోతే చట్టపరంగా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చ రించారు.

విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ టిడిపి ఆందోళన

ప్రజాశక్తి-నరసరావుపేట

విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై జొన్నలగడ్డ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అరవిందబాబు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పెం చిన విద్యుత్ ఛార్జీలను తగ్గించి ప్రజలపై భారాన్ని తగ్గించాలంటూ నినా దాలు చేశారు. నిరసనలో టిడిపి రాష్ట్ర డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, తెలుగు యువ త కుమ్మెత కోటిరెడ్డి కొల్లి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు. **దాచేపల్లి:** స్థానిక సబ్ స్టేషన్ వద్ద నగర పంచా యతి పరిధిలో తెలుగుదేశం పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. ట్రూ అప్ చార్జీలు, సర్ చార్జీలు , ఫిక్స్ చార్జీలు పేరిట పేద ప్రజ లపై భారం వేస్తున్నారని మండిపడ్డారు. **ముప్పాళ్ల :** అధిక విద్యుత్ ఛార్జీల భారం మోపు తున్న వైసిపీ ప్రభుత్వం ప్రజలను నిలువు దోపిడీ చేస్తోందని సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు విమర్శించారు. మండల కేంద్రంలోని 32 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. **ఈపూరు:** మం డల టిడిపి నాయ కుల ఆధ్వర్యంలో ఈపూరు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా టిడిపి అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు ,మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ జి.వెంకయ్య మాట్లాడారు. **పెదకూరపాడు:** స్థానిక సబ స్టేషన్ వద్ద ర్యాలీ, అనంతరం రోడ్డుపై టిడిపి నాయకులు నిరసన చేప ట్టారు. వివిధ పేర్లతో పెం చిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గిం చాలని మాజీ ఎమ్మెల్యే కొమ్మాల పాటి శ్రీధర్ డిమాండ్ చేశారు. వ్యవ సాయ పంపు సెట్లకు మీటర్లు బిగిం చడం ప్రభుత్వం ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు.

జొన్నలగడ్డ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న టిడిపి శ్రేణులు

పిహెచ్‌సిని పరిశీలించిన కేంద్ర బృందం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

మండలంలోని ఫణిదం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని కేంద్ర బృందం సోమవారం పరిశీలించింది. ఆరోగ్య కేం ద్రం లోని పలు విభాగాలను బృందం సభ్యులు డాక్టర్ కవిత, డాక్టర్ కె.ఎ.జితేష్‌లు పరిశీలించారు. రోగులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, ల్యాబ్, మందులు, ఒపి విభాగాలను తనిఖీ చేశారు. వైద్యులు సమయానికి వస్తున్నారా లేదా, ఎంత మంది రోగులకు వైద్య సేవలందిస్తున్నారు, మందులు సక్రమంగా ఇస్తున్నారా తదితర అం శాలను పరిశీలించారు. వీరి వెంట పల్నాడు జిల్లా క్వాలిటీ కన్సల్టెంట్ అధికారులు రామ్ ప్రసాద్, వాసురాజు, డాక్టర్ స్వాతి, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ ప్రదీప్ తదితరులు ఉన్నారు.

పద్మావతికి వైవి ఆంజనేయులు నివాళి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మాదల గ్రామ మాజీ విఆర్వో, జిల్లా విఆర్వోల సంఘ సీనియర్ నాయకులు ముత్తినేని నాగేశ్వరరావు భార్య పద్మావతి అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. పార్టీ నాయకుల సమాచారం మేరకు సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు, నాగేశ్వరరావు గృహానికి వెళ్లి పద్మావతి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



ఆక్రమిత భూములపై విచారణకు వినతి

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని ప్రభుత్వ భూములు వంకాయలపాడు, కారుచోల, కొండవీడు తోపాటు ఆయా గ్రామీణ ప్రాంతాల్లో అన్యాక్రాంతమయ్యాయని ఎపి గిరిజన సంఘాల ఐక్యవేదిక యడ్లపాడు మండల అధ్యక్షులు వి.శ్రీనివాస్ నాయక్ ఆరోపించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. రాజకీయ పార్టీల నాయకుల చేతుల్లో ఉన్న ఆక్రమిత భూములపై విచారణ చేపట్టి వాటి లెక్కలు తేల్చాలని శ్రీను నాయక్ డిమాండ్ చేశారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ మోజేష్ కు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి ఎం.తిరుపతి రావు, మండల ఉపాధ్యక్షులు ఉయ్యాల బలరాం, పట్టణ అధ్యక్షులు పాలపర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తిరునాళ్లలో మజ్జిగ పంపిణి

ప్రజాశక్తి-వినుకొండ

మండలం లోని శ్రీ మదమంచిపాటి వీరాంజనేయ స్వామి వారి తిరునాళ్ల సందర్భంగా వినుకొండ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు కొంజేటి నాగశ్రీను రాయల్ ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు.

అంబేద్కర్,పూలే జయంతుత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి- మంగళగిరి : ఈ నెల 11 నుండి 14వ తేదీ వరకు జరిగే మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతుత్సవాల కరపత్రాలను దళిత సంఘాల నాయకులు సోమవారం ఎస్సీ ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆర్మీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఎస్సీ ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్ కార్యలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జ్యోతిరావుపూలే జయంతి పురస్కరించుకొని, నాలుగు రోజులు పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రతిరోజు అన్ని కుల సంఘాలు, పార్టీలు పాల్గొంటాయని చెప్పారు.

మహిళల స్వయం ఉపాధికి స్త్రీశక్తి దోహదం

ప్రజాశక్తి -దుగ్గిరాల: మహిళలు స్వయం ఉపాధి పొందటానికి స్త్రీ శక్తి కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని మండల టిడిపి అధ్యక్షులు కేసునేని అనిత అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ మొదటి విడతగా 70 మంది మహిళలకు 60 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల వ్యాప్తంగా ఇప్పటివరకు 190 మంది దరఖాస్తులు చేసుకున్నారని, శిక్షణ పొందిన వారందరికీ కుట్టు మిషన్‌తో పాటు సర్టిఫికెట్ కూడా అందచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి, చిలువూరు గ్రామ సర్పంచ్ చిలువూరు మాణిక్యం, నియోజకవర్గ మహిళ ప్రధాన కార్యదర్శులు ఎ.జయసత్య, ఎం. వైష్ణవి పాల్గొన్నారు.

కృష్ణాయపాలెంలో రాజధాని రైతుల ధర్నా

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : అమరావతిలో తమ ప్లాట్లను అభివృద్ధి చేసిన తర్వాతే పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని రాజధాని రైతులు సోమవారం కృష్ణాయపాలెంలోని పేదలకు ఇస్తామన్న స్థలాల వద్ద ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజధానిని అభివృద్ధి చేయలేని సీఎం వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీఆర్డీఏ చట్టంలో మార్పులు చేసి ఆర్5 జోనే ఏర్పాటు చేసి అందులోని భూములను పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే ఊరుకోమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పోరాటంలో తమ ప్రాణాలు పోయినా సరే వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని చెప్పారు.

బాగున్న రోడ్డును పగలగొడతారా..!

- ట్రాఫిక్ సమస్యలు వస్తాయని స్థానికుల గగ్గోలు
- జిఐ పైపులైన్ వేయాలని విన్నపాలు

ప్రజాశక్తి-తాడేపల్లి:సుమారు 20 ఏళ్ల క్రితం నాణ్యతా ప్రమాణాలతో వేసిన రోడ్డును మున్సిపల్ అధికారులు పగులగొడుతున్నారు. దీంతో స్థానికులు బాగున్న రోడ్డును పగలగొట్టి పైప్ లైన్ వేయటమేంటని ప్రశ్నించారు. ఒకటో వార్డు చర్చి దగ్గర నుంచి రోడ్డు పగలగొట్టుకుంటూ వెళ్తున్న క్రమంలో బాగున్న రోడ్డును ప్రొక్లెయినర్‌తో పగులగొట్టడం వల్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో అనేక చోట్ల నూతన పైపులైన్ వేసిన సందర్భాల్లో రోడ్డు పగలగొట్టకుండా రోడ్డుపైనే జిఐ పైపులైన్ వేస్తున్నారని, రోడ్డుపైనే పైపులైన్ వేసి ఆయా ప్రాంతాల ప్రజలకు సమృద్ధిగా తాగునీరు అందించవచ్చని సూచిస్తున్నారు. చర్చి దగ్గర ఇరుకుగా ఉన్న రోడ్డును పగలగొడితే ట్రాఫిక్ ఇబ్బందులు వస్తాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పునరాలోచించి రోడ్డుపైనే పైపులైన్ వేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇంజినీరింగ్ అధికారుల వివరణ

రోడ్డు పగలగొడుతున్నారని ఎంటిఎంసి అధికారులను ప్రజాశక్తి వివరణ కోరగా కొత్తూరు అంజనేయస్వామి గుడివద్ద పంప్ హౌస్ నుండి మెయిన్ లైన్ వేయడానికి రోడ్డు తవ్వినట్లు తెలిపారు. అక్కడి నుండి ఆర్ఎంఎస్ కాలనీ వద్ద గల ఓవర్ హెడ్ ట్యాంక్‌కు మెయిన్ లైన్ వేసి నీళ్లు ఎక్కించాల్సి ఉందని తెలిపారు.

మొక్కజొన్నలో అధిక దిగుబడి

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

ఈ ఏడాది మొక్కజొన్నలో అధిక దిగుబడి వచ్చిందని కాకుమాను మండలం పెద్దివారిపాలెం గ్రామానికి చెందిన రైతు పేర్ని సాంబశివరావు అన్నారు. సోమవారం నాగులపాడు సమీపంలో తన మొక్కజొన్న పంటలో ఎకరానికి 30 టన్నులు పైగా దిగుబడి వచ్చిందన్నారు. పొలంలో యాగంటి ఆగ్రోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ భారతి సీడ్స్ వారు మొక్కజొన్న క్షేత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. పంట వైరస్ బారిని తట్టుకునే విధంగా మంచి 756 రకం మొక్కజొన్న విత్తనాలు అందజేసిన భారతి సీడ్స్ వారికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రదర్శనకు వచ్చిన పలు గ్రామాల రైతులు పంటను పరిశీలించి ఆర్ ఎస్ఎం. పల్లెకోన సుబ్బారావును అడిగి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అధిక దిగబడులను సాధించిన రైతులు పేర్ని సాంబశివరావు, కొండపాటూరు రైతు మేడ సాంబశివరావులను ఆర్ఎస్ఎం సుబ్బారావు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీలర్ ఆళ్ల సుబ్బారావు, భారతి సీడ్స్ ప్రతినిధులు కె.లక్ష్మీ బాబు, ఎన్ శ్రీనివాసరావు, వెంకటేష్, గామాలు రైతులు పాల్గొన్నారు.

పేర్ని సాంబశివరావును సత్కరిస్తున్న కంపెనీ ప్రతినిధులు

ఉండవల్లిలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - తాడేపల్లి:తాడేపల్లి మండలం ఉండవల్లిలో గ్రామ టిడిపి అధ్యక్షులు గాదె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారకీ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు అమరా సుబ్బారావు మాట్లాడుతూ సిఎం జగన్ ప్రజా వ్యతిరేక పరిపాలన పట్ల అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఉండవల్లిగ్రామ ప్రధాన కార్యదర్శి లాం నరేష్, మంగళగిరి నియోజకవర్గ అబ్జర్వర్ ముమ్మడి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

క్లారినెట్ విద్వాంసుడు శ్రీనివాస్‌కు సత్కారం

ప్రజాశక్తి -తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటర్లో సోమవారం ఎన్టీఆర్ నటించిన బంగారు మనిషి చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. ఉత్సవాల్లో రోజుకొక కళాకారులను సన్మానించే కార్యక్రమంలో పట్టణానికి చెందిన ప్రముఖ క్లారినెట్ విద్వాంసుడు కోడూరు శ్రీనివాస్‌ను జగ్గడిగుంటపాలెం పార్టీ నాయకులు ఐ.గోపి,టి. లక్ష్మినారాయణ, కె లక్ష్మయ్య, బి సత్యం, కె సాంబయ్య, కె రవికుమార్, యు. ధర్మారావులు సన్మానించి ఎన్టీఆర్ జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పానేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, గుమ్మడి ప్రసాద్, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్

చిన్న కొండ్రుపాడులోని కాటూరి మెడికల్ కాలేజీ హాస్పటల్ వారు 12వ తేదీ బుధవారం పెదనందిపాడు పిఎఎస్ కళాశాల ఆవరణలో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చల్లా మోహనరావు సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ క్యాంపులో 9 రకాల స్పెషాలిటీ వైద్య సేవలు, 5 రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అనుభవం గల డాక్టర్ల పర్యవేక్షణలో వైద్య సేవలందిస్తారని తెలిపారు. రక్త పరీక్షతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులను అందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని పెదనందిపాడు, కాకుమాను, పర్చూరు మండల గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని డాక్టర్ చల్లా మోహన్‌రావు కోరారు.

వినతి పత్రం అందజేస్తున్న ఎం. రామకృష్ణారెడ్డి

స.హ చట్టం అమలు మెరుగుకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- మంగళగిరి

సమాచార హక్కు చట్టం అమలు మెరుగుపరుచుటకు చర్యలు తీసుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎం రామకృష్ణారెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రధాన సమాచార కమిషనర్ ఆర్ఎం భాషను విజయవాడలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. చట్టం అమలకు రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు, పౌరులకు అవగాహన కల్పించాలని, ఆన్లైన్ దరఖాస్తు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. తెలుగులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో, ప్రధాన కార్యదర్శి శీలం నాగార్జున రావు, సభ్యులు కే ప్రసాద్, కౌతువరపు ప్రసాద్, శివరావులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయాల ఎదుట టిడిపి నిరసన

పెంచిన చార్జీలను తగ్గించాలని డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విద్యుత్ ఛార్జీల పెంపు ఉపసంహరించుకోవాలని కోరుతూ గుంటూరులోని టిడిపి నాయకులు, కార్యకర్తలు సోమవారం నిరసన తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర ఆధ్వర్యంలో గుజ్జనగుండ్ల సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. పెంచిన చార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. అలాగే తూర్పు నియోజకవర్గం పరిధిలోవిద్యుత్ శాఖ జిల్లా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తూర్పు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి నశీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. టిడిపి నాయకులు బుచ్చిరాం ప్రసాద్, కె. శ్రీనివాసరావు, ఎం. రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ఎస్ఈ కార్యాలయంలోకి వెళ్లి వినతిపత్రం ఇవ్వడానికి ప్రయత్నించిన నశీర్ అహ్మద్, పార్టీ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. **తెనాలి:**4ఏళ్లలో ఏడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత వైసిపి దక్కుతుందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు ధ్వజమెత్తారు. చెంచుపేటలోని విద్యుత్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు టి హరిప్రసాద్, ఏ జయలక్ష్మి, బి.అరుణ, పి.రమ్య, ఎ.పిన్నారావు ఈ.వెంకట పూర్ణచందు, కే ఏడుకొండలు, పాల్గొన్నారు.

గుంటూరు

పెదనందిపాడులోని నాగులపాడు

మంగళగిరి:పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని సోమవారం విద్యుత్ ఏడిఈ కార్యాలయం వద్ద టిడిపి ఆధ్వర్యంలో నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం 7సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిందని విమర్శించారు. పెంచిన చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. **తాడేపల్లి:**ట్రూఅప్ ఛార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులను దొంగదెబ్బ తీసిందని టిడిపి పట్టణ, రూరల్ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, సుబ్బారావు ఆగ్రహం వ్యక్తం చేశారు.సోమవారం నులకపేట విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు టిడిపి టౌన్, రూరల్ కమిటీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. **దుగ్గిరాల :** స్థానిక విద్యుత్ శాఖ సబ్ సెంటర్‌ను టిడిపి ఆధ్వర్యంలో సోమవారం ముట్టడి చేసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ మోటార్లకు మీటర్లు బిగించిన ఘనత వైఎస్ఆర్ ప్రభుత్వానికి చెందుతుందని విమర్శించారు. **పెదనందిపాడు రూరల్.:** పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని మండల కేంద్రమైన పెదనందిపాడులో టిడిపి నాయకులు సోమవారం బైకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నాగులపాడు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. స్థానిక పార్టీ అధ్యక్షుడు రావి శివరామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. **పొన్నూరు రూరల్:** పొన్నూరు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద టిడిపి శ్రేణులు, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని పొన్నూరు సిపిడిసిఎల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం. శ్రీనివాసరరావుకు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ గత నాలుగేళ్లలో వైసీపీ ప్రభుత్వం 7సార్లు విద్యుత్ చార్జీలు పెంచి రూ.17,093 కోట్లు భారం వేసిందని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు.

వరికపూడిసెలపై నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

హాజరుకానున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఇతర ప్రముఖులు, నాయకులు

ప్రజాశక్తి - వినుకొండ

వరికపూడిసెల సాధన కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం మంగళవారం స్థానిక కారంపూడి రోడ్డులోని గోగినేని కళ్యాణ మండపంలో నిర్వహిస్తామని గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోట నాయక్ సోమవారం విలేకర్లకు తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.నాగేశ్వరావు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.హరినాథ్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు, పిడిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులు, ఆల్ ఇండియా బంజారా సేవ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు జె.రాంబాబు నాయక్, ఎంఐఎం జిల్లా అధ్యక్షులు షేక్ కరిముల్లా, డివి రమణయ్య హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టి.ఆంజనేయులు, ఎస్‌కె.ఫిరోజ్, పి.భాస్కర్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కొండవీడుకోట మ్యాప్‌ను ఇస్తున్న శివారెడ్డి

19న కొండవీడు కోటను సందర్శించనున్న సిఎస్

ప్రజాశక్తి - యడ్లపాడు

కొండవీడు కోటను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి ఈనెల 19వ తేదీన సందర్శిస్తారని కొండవీడు కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జవహర్‌రెడ్డిని తాడేపల్లిలో సోమవారం కలిసి కొండవీడు కోట మ్యాప్‌ను అందించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై వివరించినట్లు తెలిపారు. కోట ప్రాముఖ్యతను, చరిత్రను వివరించామని, ఒకసారి సందర్శనకు రావాలని ఆహ్వానించామని పేర్కొన్నారు. కొండవీడు కోటలో ఉన్న ప్రాచీన కట్టడాలనూ ఆ మ్యాపులో చూశారని, ఈనెల 19న ఉదయం 8 గంటలకు కోటను సందర్శిస్తానని తెలిపారు. ఆయనతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ ముఖ్య సంరక్షణ అధికారి వై.మధుసూదన్‌రెడ్డి కూడా వస్తారని తెలిపారు. వీరి సందర్శన అనంతరం కొండవీటి రెడ్డి రాజు పెద్ద కోమటి వేమారెడ్డి రాసిన 'సప్తశతి సారము' (వ్యాఖ్య), 'అమరుకావ్యము' (వ్యాఖ్య) అనే రెండు సంస్కృత గ్రంథాలను 'సప్తశతి సారము' గ్రంథాన్ని జవహర్‌రెడ్డి, 'అమరు కావ్యం' గ్రంథాన్ని మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరిస్తారని తెలిపారు.

సత్తెనపల్లిలో విరబూసిన బ్రహ్మ కమలం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలో అరుదైన పుష్పం విరబూసింది. ఏడాదికి ఒకసారి పూసే బ్రహ్మ కమలం వికసించింది. హిమాలయాల్లో ఉండే మొక్కను స్థానిక 24 వార్డుకు చెందిన విశ్రాంత ఉద్యోగి శృంగారం తన ఇంట్లో నాటగా అది ఆదివారం రాత్రి పూసింది. ఈ పుష్పాన్ని చూసేందుకు స్థానికులు తరలివచ్చారు.

ముఖ్యమంత్రికి రాసిన పోస్టు కార్డులు చూపిస్తున్న నాయకులు

జగనన్న మమ్మల్ని రెగ్యులర్ చెయ్యన్న..

ప్రజాశక్తి-గుంటూరు : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగులందర్నీ రెగ్యులర్ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎపిజిఇఎ)ఆధ్వర్యంలో సోమవారం సిఎం జగన్మోహన్‌రెడ్డికి పోస్టు కార్డు ద్వారా వినతిపత్రాలు అందచేశారు. స్థానిక నగరంపాలెంలోని సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన కాంట్రాక్ట్ ఉద్యోగులు, సంఘ నాయకులు పాల్గొని సిఎంకు పోస్టు కార్డులు పోస్ట్ చేశారు. కార్యక్రమంలో ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కరిముల్లా షాఖాదరి, నగర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, దక్షిణామూర్తి పాల్గొన్నారు.

వేసవి.. ఈ జాగ్రత్తలు పాటిస్తే సరి..

ప్రజాశక్తి-తాడేపల్లి

ఏప్రిల్‌లోనే ఎండలు మండిపోతున్నాయి. నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు క్రమక్రమంగా పెరుగుతున్నాయి. ఉదయం 11 గంటలు దాటితే ఎండ తీవ్రంగా ఉంటోంది. ఈ క్రమంలో ప్రజలు ఎండ దెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ కెవి.కిరణ్‌కుమార్ సూచించారు. విరేచనాలు, వాంతులు, తల తిరగడం, కండరాలు పట్టేయడం వంటి లక్షణాలుంటే వడదెబ్బ తగిలినట్లన్నారు. వెంటనే దగ్గరలో ఉన్న వైద్యుని సలహా మేరకు మందులు వాడటంతో పాటు, తగిన జాగ్రత్తలు పాటిస్తే కోలుకోవచ్చని తెలిపారు. వడదెబ్బ తగలకుండా ఉండాలంటే ప్రతిఒక్కరూ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి నాలుగు గంటల వరకు బయటకు రాకుండా ఉండటమే మంచిదన్నారు. నీరు ఎక్కువగా తాగడంతోపాటు సబ్జా నీరు, కొబ్బరి నీళ్ల వంటివి ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. వడదెబ్బ తగిలిన సమయంలో జ్వరం వందకు మించితే సమీపంలోని హెల్త్ సెంటర్‌కు వెళ్లాలన్నారు. ఇంట్లో ఎప్పుడూ ఒఆర్ఎస్ వాటర్‌ను అందుబాటులో ఉంచుకోవాలని, దీనివల్ల వడదెబ్బ నుంచి వెంటనే కోలుకోవచ్చని తెలిపారు. డీహైడ్రేషన్, వడదెబ్బకు తాడేపల్లి హిహెచ్‌సిలో వైద్యం అందుబాటులో ఉందని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కెవి కిరణ్‌కుమార్

రంజాన్ రోజు ఈద్గాల వద్ద మౌలిక సదుపాయాలు : మేయర్

మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

ముస్లిమ్ సోదరులు రంజాన్ పండుగ రోజున ప్రత్యేక ప్రార్ధనలు జరుపుకొనే ఈద్గాల వద్ద ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలను నగర పాలక సంస్థ తరుపున చేపడతామని నగర మేయర్ కావటిశివనాగ మనోహర్‌నాయుడు తెలిపారు. మేయర్‌ను అంజుమన్ కమిటీ సభ్యులు ఆయన ఛాంబర్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రంజాన్ పండుగ రోజున ప్రత్యేక ప్రార్ధనలు చేసుకునే నగరంపాలెం రోడ్డులోని ఈద్గా వద్ద ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. నగరంపాలెం, పాత బస్టాండ్‌వద్ద గల ఉర్దూబాయ్స్ పాఠశాలలో, పొన్నూరు రోడ్డులోని బిఇడి కళాశాల వద్ద గల ఈద్గాల వద్ద పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలకు వచ్చే ముస్లిమ్ సోదరులకు అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక పారిశుధ్య పనులు, జంగల్ క్లియరెన్స్, తాగు నీరు, టెంట్ల ఏర్పాటు వంటివి గతంలో మాదిరిగానే ఈసారి కూడా చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ మహమూద్, ఖాజా మొహిద్దీన్‌చిష్టీ, అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్ మహమ్మద్ కర్నూమ, సెక్రటరీ సయ్యద్ అబ్దుల్ సలాం, డైరెక్టర్ హిదాయత్ పాల్గొన్నారు.

ఎస్టీ గురుకులంలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని స్టేషన్ రోడ్డులో ఉన్న బాలికల గిరిజన సంక్షేమ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికిగాను ఖాళీ సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.సరస్వతి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన జారీ చేశారు. 3వ తరగతిలో ఎస్‌టి- 32, ఎస్సీ-5, బిసి-2, ఓసీ-1 సీటు, 4వ తరగతిలో ఎస్‌టి-2, 6వ తరగతిలో ఎస్‌టి-7 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 29వ తేదీ వరకూ పాఠశాలలో స్వీకరిస్తామని, ఒకటో తేదీన ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష పాఠశాలలోనే ఉంటుందని తెలిపారు.

వర్సిటీ అధ్యపకురాలికి ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీగౌరీ కోసూరికి ఇంటర్నేషనల్ ఎక్సలెంట్ అవార్డు లభించింది. ఆమె రాసిన 'హ్యూమన్ రైట్స్ డైమెన్షన్ అఫ్ లేబర్ రైట్స్ ఇన్ ఇండియా' బుక్‌కు గాను ఎక్సెల్లర్ బుక్స్ కో-ఫౌండర్ అంజిత గంగూలీ 'ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు-2023' ను ప్రధానం చేశారు. డాక్టర్ శ్రీగౌరీని టెక్స్‌బుక్ రైటర్‌గా గుర్తించి అకడమిక్ రిఫరెన్స్ క్యాటగిరీలో ఈ అవార్డును ప్రకటించారు. ఆమెను వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.రాజశేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, న్యాయ విభాగానికి చెందిన అధ్యాపకులు అభినందించారు.

అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులకు క్యూఆర్ కోడ్‌లు

బ్రాడీపేటలో తొలివిడతగా ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలోని హోర్డింగ్స్ విధానం పూర్తి పారదర్శకంగా ఉండేలా, ప్రతి ప్రకటన బోర్డు జిఎంసికి తగిన ఫీజులు చెల్లించేలా సమగ్ర క్యూఆర్ కోడ్ విధానం అమలు చేస్తున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. కమిషనర్ ఆదేశాలతో సోమవారం పట్టణ ప్రణాళిక అధికారులు ప్రకటనల బోర్డ్‌లకు క్యూఆర్ కోడ్‌లను తొలుతగా బ్రాడీపేటలో ఏర్పాటు చేశారు. నగరంలో ప్రకటనల హోర్డింగ్స్ విధానం పూర్తి పారదర్శకంగా ఉండేలా, ప్రతి బోర్డ్‌కు నగరపాలక సంస్థకు ఫీజులు ఎంత, ఎప్పటి వరకు చెల్లించింది, యజమాని తదితర వివరాలను క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా తెలుసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ పేర్కొన్నారు. తొలి విడతగా బకాయిలు చెల్లించిన వారి బోర్డులకు కోడ్ ఏర్పాటు చేస్తున్నామని, ఇక నుండి కోడ్ లేని బోర్డులు అనధికార బోర్డులుగా పరిగణించి తొలగించడానికి పట్టణ ప్రణాళిక అధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారని పేర్కొన్నారు. కొంతకాలంగా హోర్డింగ్ ఫీజులు, వాటి సంఖ్యపై పలు ఆరోపణలు వచ్చాయని, ఇక నుండి నగరంలో అనధికార హోర్డింగులు, బోర్డులు లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని తెలిపారు. బోర్డులకు ఏర్పాటు చేసే కోడ్‌లను మరొక చోట ఏర్పాటు చేయడానికి వీలు లేకుండా లాంగిట్యూడ్, లాటిట్యుడ్‌లో ఆయా బోర్డుల లోకేషన్ కేటాయిస్తామని, నగరంలో అన్ని యాడ్ ఏజెన్సీలు, వ్యక్తిగత బోర్డ్‌లు కలిగిన వారు తప్పనిసరిగా బకాయిలు చెల్లించి, ఆయా బోర్డులకు క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే తగిన చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్లు మూర్తి, కోటయ్య, ఎసిపి బాబురావు, టిపిఎస్‌లు సువర్ణకుమార్, హదయరాజు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్ ఏర్పాటును పర్యవేక్షిస్తున్న పట్టణ ప్రణాళిక అధికారులు